హైదరాబాద్ వార్త



## నాచారం, కాప్రా సర్కిళ్లలో పర్యటించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ వినయ్ కృష్ణా రెడ్డి

**నాచారం, మార్చి 31,ప్రభాతవార్త:**
కాప్రా, నాచారం సర్కిళ్ల పరిధిలోని వార్డు ఎంటమాలజీ సూపర్వైజర్లతో ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సూపర్వైజర్ల పనితీరును సమీక్షిస్తూ, ఉదయం హాజరు నమోదు నుంచి రోజువారీ విధులు పూర్తయ్యే వరకు తీసుకుంటున్న చర్యలను వివరంగా అడిగి తెలుసుకున్నారు.దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచిస్తూ, ప్రతి ఇంటిలో నిల్వ ఉన్న నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైన ప్రదేశాల్లో దోమల నివారణకు కెమికల్ స్ప్రే నిర్వహించాలని తెలిపారు. యాంటీ లార్వా ఆపరేషన్, ఫాగింగ్ పనులపై వివరాలు తెలుసుకుని, వాటిని మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించడం, గంబూసియా చేపలను వదలడం వంటి కార్యక్రమాలను చేపట్టాలని అధికారులకు సూచించారు.ఈ సమావేశంలో సీనియర్ ఎంటమాలజిస్ట్ మాధవరెడ్డి, నాచారం డిప్యూటీ కమిషనర్ నిత్యానందం, కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# నగరం నలువైపులా 'హైడ్రా ఆపరేషన్స్'



## -8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటకు ఫెన్సింగ్
## -పలు చోట్ల పార్కులు, రహదారుల ఆక్రమణలు తొలగింపు



ఆక్రమ నిర్మాణాలు తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:**
నగరం నలువైపులా మంగళవారం హైడ్రా ఆపరేషన్లు నిర్వహించింది. భారీయెత్తున ఆక్రమణలు తొలగించింది. ఐటీ కారిడార్‌కు చేరువలో మంచి రేవుల వద్ద ఉన్న 8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటను కాపాడింది. అలాగే ఘట్‌కేసర్ మండలంలోని అవుషాపూర్‌లో 1440 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా రక్షించింది. దుండిగల్-గండిమైసమ్మ మండలం బౌరంపేట గ్రామ పరిధిలో గండిమైసమ్మ-మియాపూర్ ప్రధాన రహదారిపై అక్రమంగా నిర్మించిన షెడ్లను హైడ్రా తొలగించింది. ఇలా నగరంలో పలు చోట్ల ఆక్రమణలను మంగళవారం హైడ్రా తొలగించగా స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం, మంచిరేవుల గ్రామంలో ఏకంగా చెరువును మాయం చేసేయాలని చూసిన కబ్జాదారుల ప్రయత్నాలను హైడ్రా మంగళవారం అడ్డుకుంది. కబ్జాదారులు కూడా సాధారణ వ్యక్తులు కాదు. బడా నిర్మాణ సంస్థలు. 8.24 ఎకరాల నాగిరెడ్డి కుంటకు నలువైపులా కబ్జాలకు తెరదీశారు. గ్రామ, రెవెన్యూ రికార్డుల్లో చెరువుగా స్పష్టమైన ఆధారాలున్నాయి. 8.24 ఎకరాల చెరువుగా హెచ్ఎండీఏ గుర్తించింది. చెరువు కనిపించకుండా ఏకంగా 20 ఫీట్ల టిన్ షీట్స్‌తో ప్రహరీ నిర్మించి 4 ఎకరాలకు బడా రియల్ ఎస్టేట్ సంస్థ ఫెన్సింగ్ వేసింది. 20 ఫీట్ల రేకుల గోడ కట్టి లోపల చెరువు ఉందనేది కూడా తెలియకుండా ఆక్రమణలకు తెగబడింది ఆ సంస్థ. మరో వైపు ఇంకో నిర్మాణ సంస్థ 3 ఎకరాలను కబ్జా చేసింది. స్థానిక మాజీ ప్రజాప్రతినిధి కూడా ఎకరానికిపైగా కబ్జా చేసి వేరేవాళ్లకు అమ్మేశారు. ఇలా 8.24 ఎకరాల చెరువును కబ్జా చేసి అమ్ముకునే ప్రయత్నాలను హైడ్రా అడ్డుకుంది. ప్లాట్లుగా మార్చుకొని ప్రీకాస్ట్ ఇటుకలతో ప్రహరీలు నిర్మించి అందులో తాత్కాలిక గదులు నిర్మించి ఉంటే.. వాటిని పూర్తిగా తొలగించింది. చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసి.. హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. 8.24 ఎకరాల నాగిరెడ్డికుంట కబ్జాలకు గురైందని స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులతో పరిశీలించి.. ఈ మేరకు చర్యలు తీసుకుంది. హైడ్రాకు ఫిర్యాదు చేసిన వెంటనే చర్యలు తీసుకోవడంతో నాగిరెడ్డి కుంటను బతికించుకున్నామని.. ఏమాత్రం ఆలస్యం అయినా శాశ్వత నిర్మాణాలు వచ్చేసేవని పేర్కొన్నారు. హైడ్రా చర్యలను అభినందించారు.

**150 ఫీట్ల రహదారిపై షాపుల దందాకు చెక్..**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా దుండిగల్ - గండిమైసమ్మ మండలం బౌరంపేట గ్రామ పరిధిలో గండిమైసమ్మ-మియాపూర్ ప్రధాన రహదారిపై అక్రమంగా నిర్మించిన షాపులను హైడ్రా మంగళవారం తొలగించింది. 150 అడుగుల ప్రధాన రహదారికి ఇరువైపులా ఓ వ్యక్తి ఆక్రమణలకు పాల్పడి తాత్కాలిక షెడ్డులు వేసి అద్దెలకు నడుపుతున్నాడనే ఫిర్యాదులను హైడ్రా క్షేత్ర స్థాయిలో పరిశీలించింది. ఆక్రమణలతో రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయని గుర్తించింది. ఇందులో స్క్రాప్ దుకాణాలు, ఇతర షాపుల వాళ్లకు రెండు నెలల ముందే ఖాళీ చేయాలని చెప్పి రహదారిని ఆనుకుని నిర్మించిన 10 షాపులు(షెడ్డులు)ను తొలగించింది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగినట్టయ్యింది.

**1440 గజాల పార్కుకు ఫెన్సింగ్..**

మెద్చల్ - మల్కాజిగిరి జిల్లా గట్‌కేసర్ మండలం అవుషాపూర్ గ్రామ పరిధిలో 68వ సర్వే నంబరులో 1987లో 60 ఎకరాల మేర లే ఔట్ వేశారు. ఇందులో 1440 గజాల స్థలాన్ని పార్కుకోసం కేటాయించారు. తర్వాత కొన్నాళ్లకు దానిని ప్లాట్లుగా మార్చి 6 ప్లాట్లు చేశారు. ఇదే విషయాన్ని హైడ్రా ప్రజావాణిలో స్థానికులు ఫిర్యాదు చేశారు. అమ్మకాలు జరుగుతున్న సమయంలోనే పార్కు స్థలమంటూ హైడ్రా అడ్డుకుంది. మంగళవారం పార్కు చుట్టూ హైడ్రా ఫెన్సింగ్ వేసి పార్కు స్థలంగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది.

**జూబ్లీహిల్స్‌లో 300ల గజాల స్థలాన్ని కాపాడిన హైడ్రా**

జూబ్లీహిల్స్‌లో గజం స్థలం కొనాలంటే రూ. 2 లక్షలు పెట్టాల్సిందే. ఈ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని జూబ్లీహిల్స్ సొసైటీకి గతంలో ప్రాతినిధ్యం వహించిన వారు వరద కాలువలున్నా పట్టించుకోకుండా ప్లాట్లుగా సృష్టించారు. 120 గజాల ఓ ప్లాట్, 180 గజాలతో మరో ప్లాట్ సృష్టించి అమ్మేశారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయి. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలోని ఓప్లాట్ యజమాని ఇదే విషయాన్ని హైడ్రా ప్రజావాణిలో పిర్యాదు చేశారు. జీహెచ్ఎంసీ అధికారులతో పాటు సంబంధిత శాఖలతో కలిసి హైడ్రా క్షేత్ర స్థాయిలో విచారించింది. మాదాపూర్ మెట్రో స్టేషన్ నుంచి వచ్చే వరద కాలువతో పాటు.. జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి వైపు నుంచి వచ్చే మరో వరద కాలువ బాక్స్ డ్రైన్లుగా ఉన్నాయి. బాక్సు డ్రైన్లు ఉంటుండగా.. పైన నిర్మాణాలు చేసేద్దామని ఆలోచనలో ఉన్నట్టు వెల్లడైంది. టిన్ షీట్స్‌తో ప్రహరీలు నిర్మించి.. లోపల వాచ్‌మ్యాన్‌కు గదులు నిర్మించగా.. వాటిని హైడ్రా మంగళవారం తొలగించింది.

## నిఘా నీడలో.. రేపు హనుమాన్ విజయయాత్ర
### 12 కి.మీ.. భారీ పోలీస్ బందోబస్తు



హనుమాన్ విజయ యాత్ర రూట్‌ను పరిశీలిస్తున్న సీపీ సజ్జనార్, చిత్రంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త**
నగరంలో ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి వేడుకలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ సర్వం సిద్ధం చేస్తోంది. యాత్ర ఏర్పాట్లపై బుధవారం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆడిటోరియంలో నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనర్ అధ్యక్షతన వివిధ ప్రభుత్వ శాఖలు, ఉత్సవ నిర్వాహకులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీ మాట్లాడుతూ మూడు రోజులక్రితం జరిగిన శ్రీరామ నవమి శోభాయాత్రను అత్యంత ప్రశాంతంగా నిర్వహించామని,అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అదే స్ఫూర్తితో హనుమాన్ విజయ యాత్రను కూడా దిగ్విజయంగా పూర్తి చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈసారి ప్రధాన యాత్రలో సుమారు 168 శోభాయాత్రలు కలవనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 3,000 మంది పోలీసు సిబ్బందితో పాటు అదనపు సాయుధ బలగాలు, టాస్క్ ఫోర్స్ బృందాలను కీలక ప్రాంతాల్లో మోహరిస్తున్నట్లు వెల్లడించారు. యాత్ర నిర్వహణలో వాలంటీర్లకు తగిన శిక్షణ ఇచ్చి, రోప్ పార్టీ సభ్యులను అధిక సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సీపీ సూచించారు. యాత్రలో కొత్త వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, నిర్ణీత మార్గాల్లోనే యాత్ర సాగేలా చూడాలని కోరారు. ఫ్లైఓవర్లు, రైల్వే బ్రిడ్జిల దృష్ట్యా విగ్రహాల ఎత్తు విషయంలో జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మళ్లింపులు చేపడతామని, ప్రజలు పోలీసుల సూచనలు పాటించాలని కోరారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రధాన శోభాయాత్ర గౌలిగూడ, రాంమందిర్ నుంచి అఫ్జల్‌గంజ్ మీదుగా సికింద్రాబాద్ తాడ్‌బండ్ వరకు సుమారు 12 కిలోమీటర్ల మేర సాగనుంది. ఇందులో 10.5 కిలోమీటర్లు హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో ఉండగా, మిగిలిన భాగం మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో సాగుతుంది. ఈ సమావేశంలో మల్కాజిగిరి డిసిపి కూడా పాల్గొని భద్రతా పరమైన అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ డి.జోయల్ డెవిస్, జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ రవి కిరణ్, నిర్వహక సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు హాజరైనారు.

**శోభాయాంత్ర రూట్ ఇలా..**

హనుమాన్ యాత్ర ఏప్రిల్ 2న గురువారం ఉదయం 8 గంటలకు యజ్ఞనంతో ప్రారంభమై వివిధ శకటాలతో గౌలిగూడ రాంమందిర్ నుంచి కోఠి ఆంధ్రా బ్యాంక్ చౌరస్తా, సుల్తాన్‌బజార్ చౌరస్తా, రాంకోఠి చౌరస్తా, కాచిగూడ చౌరస్తా, వైఎంసిఏ నారాయణగూడ, ఫ్లైఓవర్ బ్రిడ్జి, చిక్కడపల్లి, ఆర్టీసి క్రాస్‌రోడ్, అశోక్‌నగర్ క్రాస్‌రోడ్, గాంధీనగర్, బన్సీలాల్‌పేట్ జంక్షన్, బైబిల్ హౌస్, సికింద్రాబాద్ బాటా, రాంగోపాల్‌పేట్, సీటీఓ జంక్షన్, రాయల్ ప్యాలెస్ నుంచి తాడ్‌బండ్ హనుమాన్ దేవాలయం వరకు సాగుతుంది.

## ప్రాపర్టీ టాక్స్ ముందుగా చెల్లిస్తే ఐదు శాతం రాయితీ
**-ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ ఆర్ వి కర్ణన్**

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:**
2026-27 సంవత్సరానికి సంబంధించి ముందస్తు ఆస్తి పన్ను చెల్లించి ఎర్లీ బర్డ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ కమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఓప్రకటన విడుదల చేశారు. ఏప్రిల్ నెలలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2026-27)కి సంబంధించిన మొత్తం ప్రాపర్టీ టాక్స్‌ను ముందుగానే చెల్లించే వారికి 5 శాతం రాయితీ లభించనుందన్నారు. గత సంవత్సరాల బకాయిలపై ఈ రాయితీ వర్తించదన్నారు.జిహెచ్ఎంసి పరిధిలోని ఆస్తి పన్ను చెల్లింపుదారులు ఆర్థిక సంవత్సరంకు గానూ ముందుగానే తమ ఆస్తి పన్ను చెల్లించి ప్రభుత్వం కల్పించిన 5 శాతం రాయితీని పొందాలనికమిషనర్ ఆర్ వి కర్ణన్ కోరారు.

## కాళ్ళు మొక్కుతా చెత్తను చెత్తబండిలోనే వేయండి



కళ్ళు మొక్కుతూ విజ్ఞప్తి చేస్తున్న సూపర్వైజర్ మహేందర్ ..

**కార్వాన్,మార్చి 31(ప్రభాతవార్త)**
నగరంలో చెత్త సమస్యపై ప్రజలకు అవగహన కల్పించేందుకు జిహెచ్ఎంసి పారిశుధ్య విభాగం సూపర్‌వైజర్ వినత్న నిర్ణయం తీసుకున్నారు.గుడిమల్కాపూర్ డివిజన్ పరిధి రాంసింగ్ పురా ప్రాంతంలో కార్వాన్ నుంచి రాంసింగ్ పురా వైపు వెళ్లే మార్గంలో పెద్దఎత్తున చెత్త వేస్తున్న దృశ్యాలను సూపర్వైజర్ మహేందర్ గమనించి అక్కడే ని ల్చొని చెత్త సంచులు తీసుకొస్తున్న వాళ్లని ఆపి దయచేసిఇక్కడ చెత్త వేయంకండి, మీ ఇంటి వద్దకు వచ్చే చెత్త బండిలోనే చెత్తను వేయండి అంటూ కాళ్ల మొ క్కి మరీ విజ్ఞప్తి చేశారు. ఉద్యోగి చేసిన పని అందరినీ ఆకట్టుకుంది.ఆయన చూపిన వినయం, నిబద్ధ త స్థానికులను కదిలించింది.స్వచ్ఛమైన నగరం కోసం మనందరం బాధ్యత వహించాలి అని అయన నగర ప్రజలకు పిలుపు నిచ్చారు.ఈ వినూత్న అవగాహన కార్యక్రమంతో జీహెచ్ఎంసీ సూపర్వైజర్ మహేందర్ ప్రశంసలు అందుకొంటున్నారు.

## చెత్త తొలగింపుకు అడ్డుగా కార్లు.. వినూత్నంగా స్పందించిన అధికారులు



**పేట్ బషీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త**
చెత్త తొలగింపు పనులకు అడ్డుగా వాహనాలను పార్క్ చేయడంతో జీహెచ్ఎంసీ అధికారులు వినూత్నంగా స్పందించారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జీడిమెట్ల డివిజన్ దుర్గా ఎస్టేట్ కమ్యూనిటీ హాల్ పరిసరాల్లో సోమవారం ఉదయం పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు.రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్త, పిచ్చి మొ క్కలను తొలగించేందుకు జేసీబీలు, టిప్పర్లు తీసుకువచ్చిన సిబ్బందికి అక్కడ పార్క్ చేసిన కార్లు అడ్డుగా మారాయి. వాహన యజమానులను పలుమార్లు సంప్ర దించినా స్పందన లేకపోవడంతో సర్కిల్ ఉప కమిషనర్ శంకర్ సింగ్ ఆదేశా ల మేరకు చెత్తను కార్లపై వేసి పనులను కొనసాగించారు.ఈ చర్యతో అక్కడి ప్రజలు ఆశ్చర్యానికి గురయ్యారు. ప్రజలు రోడ్లపై వాహనాలు పార్క్ చేసేటప్పుడు పరిశుభ్రత కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## 11న పూలే దంపతుల విగ్రహావిష్కరణ
**లేక్‌వ్యూ పార్కు వద్ద ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు

**హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త:**
బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేసిన మహాత్మ జ్యోతిబాపూలే, సా విత్రిబాయి పూలేలు మార్గదర్శకులుగా నిలుస్తారని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ట్యాంక్ బండ్ ఐమాక్స్ థియేటర్ ఎదురుగా లేక్ వ్యూ పార్క్ వద్ద ఏప్రిల్ 11 వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి చేతుల మీదిగా ప్రారంభించుకునే మహాత్మా జ్యోతిబాపూలే,సావిత్రి బాయి పూలే విగ్రహ నిర్మాణ పురోగతి పనులను మంత్రి కొండా సురేఖ, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, బీసీ సంఘాల సభ్యులతో కలిసి మంత్రి పనులను పరిశీలించి అనంతరం ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించి 11 వ తేదీ పూలే విగ్రహావిష్కరణ ప్రారంభంపై ఏర్పాట్ల పై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ అధికారులు పనులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వేగవంతంగా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే నిర్దేశించిన విధంగా పనులను రెండు రోజుల ముందే పూర్తి చేసి ప్రారంభానికి అందుబాటులో ఉంచాలని హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, హైదరాబాద్ జిల్లా అధికారులు, నేతలు సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి ఆదేశించారు.అనంతరం మంత్రి కొండా సురేఖా మాట్లాడుతూ పూలే కుల వివక్షను ఎదుర్కొని సమానత్వం కోసం ఎంతో పోరాడారని అన్నారు. మహిళల విద్య ప్రో త్సాహణ, బాల్య వివాహాల నిరోధంలో జ్యోతిబా పూలే, సావిత్రిబాయ్ పూలే కీలక పాత్ర పోషించారని తెలి పారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపి.వి హనుమంతరావు, ఎమ్మెల్సీ బసవ రాజు సారయ్య,ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎంఎల్ఏ దానం నాగేందర్, కవ్వంపల్లి సత్యనారాయణ, నవీన్ యా దవ్, కాలేరు వెంకటేష్ ,ముఠా గోపాల్, బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, మాజీ మేయర్ గద్వాల విజయ లక్ష్మీ,కార్పొరేషన్ చైర్మన్‌లు, శ్రీకాంత్ గౌడ్ ,మెట్టు సాయి కుమార్, జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ కమిషనర్ బాలమయాదేవి, కలెక్టర్ హరి చందన దాసరి, కమిషనర్లు పాల్గొన్నారు.

## ప్రజలను కాపాడడంలో బ్యాంక్ ఉద్యోగులు పాత్ర కీలకం: సిపి సజ్జనార్

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త**
సైబర్ నేరాల నుంచి ప్రజలను కాపాడడంలో బ్యాంక్ ఉద్యోగులు పాత్ర కీలకమని,బ్యాంకర్లు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ సూచించారు. డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాల బారిన పడిన బాధితులు ఆందోళనతో డబ్బు విత్‌డ్రా చేస్తున్నప్పుడు బ్యాంకర్లు వారిని గమనించి ఆరా తీయాలన్నారు. ప్రజల సొమ్ముకు కాపలాదా రులుగా ఉన్న బ్యాంకర్లు తమ కస్టమర్ల పట్ల మరింత బాధ్యతగా వ్యవ హరిస్తూ..వారు ఏదైనా మోసానికి గురవుతున్నట్లు గమనిస్తే వెంటనే అప్రమత్తం చేయాలని సూచించారు. ముఖ్యంగా డిజిటల్ అరెస్టులు, పెట్టుబడి మోసాల బారిన పడినప్పుడు కస్టమర్లు తమ డిపాజిట్లను హు టాహుటిన విత్‌డ్రా చేయడం లేదా బంగారంపై అప్పులు తీసుకోవడం వంటివి చేస్తుంటారని గుర్తు చేశారు. అటువంటి సమయాల్లో వారి ప్రవ ర్తనలో ఏవైనా అసాధారణ మార్పులు, ఆందోళన కనిపిస్తే అది సైబర్ ముఠాల పనేమోనని అనుమానించి ఆరా తీయాలని సూచించారు. ముఖ్యంగా వృద్ధుల సొమ్మును కాపాడాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉందని..అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీపీ సజ్జనార్ ట్విట్టర్ వేదికగా కోరారు.

# ఘనంగా మహావీర్ జయంతి
**వేడుకల్లో పాల్గొన్న అజారుద్దీన్, హరీష్‌రావు, తలసాని**



మహావీర్ జయంతి వేడుకలను ప్రారంభిస్తున్న మంత్రి అజారుద్దీన్



భగవాన్ మహావీర్ జయంతి సందర్భంగా నగరంలో నిర్వహించిన యాత్ర

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త :**
అహింస, సత్యం, మరియు ఆత్మనిగ్రహం వంటి భగవాన్ మహావీరుని సూత్రాలు, ప్రగాఢమైన ఆధ్యాత్మిక బోధనలు అందరికి ఆదర్శం అని రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ చెప్పారు. జైన మత స్థాపకులు, 24వ తీర్థంకరులైన భగవాన్ మహావీరుని 2625వ జన్మదినాన్ని పురస్కరించుకుని జైన్ సేవా సంఘ్ నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించింది. తొలుత మహావీర్ జయంతిని పురస్కరించుకొని జైన్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో బేగంబజార్, ఫీల్‌ఖానా జైన్ మందిరం నుండి భక్తిని సాంస్కృతిక వైభవంతో మేళవించిన ఉత్సాహభరితమైన భారీ శోభా యాత్ర ప్రారంభమై నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వరకు సాగింది. ఈ భారీ ఊరేగింపులో భగవాన్ మహావీర్ ప్రధాన రథం, విభిన్న ఇతివృత్తాలతో కూడిన శకటాలు, సాంప్రదాయ దుస్తులలో పురుషులు, మహిళలు పిల్లలు, సంగీత బృందాలు, గుర్రపు బగ్గీలు, యువతుల స్కూటర్ ర్యాలీ మరియు పవిత్రమైన కుండలను మోస్తున్న మహిళలు పాల్గొన్నారు. అంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన భగవాన్ మహావీర్ జయంతోత్సవాలను మంత్రి మొహమ్మద్ అజారుద్దీన్ భగవాన్ మహావీర్ చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించడం ద్వారా దేశంలో హైదరాబాద్ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. అన్ని మతాల మధ్య ఐక్యత మరియు సహజీవనాన్ని పెంపొందించే సమ్మేళన సంస్కృతి కొనసాగుతూనేఉండాలని, అందరు అన్ని పండుగలను శాంతియుతంగా జరుపుకోవడానికి హైదరాబాద్ ఒక ఉదాహరణగా నిలవాలన్నారు. మాజీ మంత్రి టి.హరీష్‌రావు మాట్లాడుతూ భగవాన్ మహావీర్ చెప్పిన అహింస పరమో ధర్మః' అనే సందేశం కేవలం మాట కాదని, అది ప్రతి ఒక్కరూ ఆచరించాల్సిన జీవన విధానమని అన్నారు. హింస, ద్వేషం పెరుగుతున్న ఈ కాలంలో మహావీరుని బోధనలు సమాజానికి దిక్సూచిగా నిలుస్తాయని తెలిపారు. తమ ప్రభుత్వంలో జైన్ సమాజానికి తగిన ప్రాధాన్యం కల్పించామని, మైనార్టీ కమిషన్‌లో సభ్యత్వం, ఉప్పల్ భగాయత్‌లో జైన్ భవన్‌కు భూమి కేటాయింపు వంటి చర్యలు తీసుకున్నామని వివరించారు. మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ అహింస, సత్యం వంటి భగవాన్ మహావీర్ బోధించిన సూక్తులను ప్రతి ఒక్కరు పాటించి సన్మార్గంలో నడవాలని కోరారు. విశ్వ హిందూ పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు హుకుంచంద్జీ సావ్లా మాట్లాడుతూ భగవాన్ మహావీరుని బోధనలు మతపరమైన సరిహద్దులను అధిగమించి, మానవాళికి శాశ్వతమైన జ్ఞానాన్ని అందిస్తామన్నారు. ఈ ఉత్సవాలలో ప్రముఖ భక్తి గాయని గాయకులూ భక్తి పాటలను ఆలపించగా,రాష్ట్ర మైనారిటీల కమిషన్ సభ్యులు హిమాన్షు బాప్నా,జైన్ సేవా సంఘ్ మార్గదర్శక మండల్ చైర్మన్ యోగేష్ కుమార్ సింగి, అధ్యక్షులు ఉమేష్ బాజీరెచ్చ, సీనియర్ ఉపాధ్యక్షులు కైలాష్ భండారి, ఉపాధ్యక్షులు వినోద్ ముఖాన, కార్యదర్శి విమల్ ముథ, కోశాధికారి సురేష్ సూరన, సంయుక్త కార్యదర్శి యోగేష్ సోని, ముఖ్య కన్వీనర్ లు సునీల్ కావడియా, దిలీప్ భండారి, దిలీప్ షెటియా, వర్కింగ్ కమిటీ సభ్యులు అశోక్ ముథ, మనోజ్ టాటెడ్, రాకేష్ సూరన తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనం ముందే బైక్‌పై యువకుల స్టంట్స్
**-యువకులు ఇబ్బందులు సృష్టిస్తే తాట తీస్తామని డిసిపి హెచ్చరిక**

**అత్తాపూర్ మార్చి31,ప్రభాతవార్త :**
యువకులు బైక్‌లపై విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తే తాట తీస్తామని రాజేంద్రనగర్ డిసిపి శ్రీనివాస్ హెచ్చరించారు.ఈనెల 27న అర్ధరాత్రి సమయంలో అత్తాపూర్ పిల్లర్ నెంబ143 వద్ద కానిస్టేబుల్ సబిత,ఇతర పోలీసు సిబ్బంది పోలీసు కారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కొందరు ఆకతాయిలు కావాలని బైక్‌పై విన్యాసాలు చేస్తూ పోలీసు వాహనం ముందు హంగామా సృష్టిస్తూ ఇతర వాహనాదారులకు ఇబ్బందులు కలిగించారు.అదేవిధంగా పోలీసు వాహనం ముందు బైక్ విన్యాసాలు చేసినట్లు విడియోలు సోషల్ మీడియాలో అప్లోడ్ చేశారు.దీంతో కానిస్టేబుల్ సబిత ఫీర్యాదుతో అత్తాపూర్ ఎస్‌హెచ్ఓ ఆదేశాల మేరకు బైక్‌పై విన్యాసాలు చేసిన నిందితులు మహమ్మద్ అమెర్ బాబా (21) మహమ్మద్ అశ్వాక్ (19),మహమ్మద్ సమీరుద్దీన్ (26),మహమ్మద్ నషీత్ (20)లను అరెస్టు చేసి వారి నుండి హోండా డియో ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా డిసిపి శ్రీనివాస్ అత్తాపూర్ పోలిసు స్టేషన్‌లో నిందితులకు కౌన్సిలింగ్ ఇచ్చాడు. ప్రమాకరమైన స్టంట్స్ చేస్తూ రోడ్లపై హంగామా సృష్టిస్తే తాట తీస్తామని హెచ్చరించారు.నిబంధనలకు అనుగుణంగా వాహనదారులు నడుచుకోవాలని సూచించారు.



## నిమ్స్‌లో వయోవృద్ధులకు ఉచిత ఆరోగ్యవైద్య శిబిరం



వైద్యశిబిరంలో పాల్గొన్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప

**జూబ్లీహిల్స్, మార్చి 31, ప్రభాతవార్త:** నిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో వయోవృద్ధులకు మంగళవారం ఉచిత ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హెల్త్ మిషన్-100 కార్యక్రమంలో భాగంగా ఈ సమగ్ర ఆరోగ్య పరీక్షల శిబిరాన్ని ఏర్పాటుచేశారు. నిమ్స్ జెరియాట్రిక్ మెడిసిన్ ప్రొఫెసర్ వై. సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో, ఆసుపత్రి పరిపాలనా విభాగం సమన్వయంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. దాదాపు 100 మంది వయోవృద్ధులకు ఇక్కడ ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారికి రక్తపరీక్షలతోపాటు ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ వృద్ధులలో వ్యాధులను ముందస్తు దశలోనే గుర్తిస్తే సరైన చికిత్స అందించడానికి ఎంతో ఉపయోగం అన్నారు. భవిష్యత్తులో నిమ్స్ ఆసుపత్రి ద్వారా మరన్ని సేవా కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్నారు. ప్రొఫెసర్ వై. సత్యనారాయణ మాట్లాడుతూ.. వయో వృద్ధులకు ఈ ఉచిత పరీక్షల ద్వారా ఎంతో మేలు జరుగుతుందన్నారు.

### నిమ్స్‌లో ఉద్యోగుల పదవీ విరమణ

నిమ్స్ ఆసుపత్రిలో పలువురు ఉద్యోగులు మంగళవారం పదవీ విరమణ చేశారు. సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ ఎం. హిమబిందు, నర్సింగ్ ఆఫీసర్ సరోజాదేవి నీలా, సివిల్ గ్రేడ్ 1 హరిచంద్ర ప్రసాద్ పదవీ విరమణ పొందిన వారిలో ఉన్నారు. వీరిని ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ రిజిస్ట్రార్ శాంతి వీర్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ దయాకర్, డాక్టర్ మార్త రమేష్, హెచ్‌ఆర్‌డి స్టాఫ్ ఏఎన్ జ్యోతి శైలజ, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళలు విద్యాపరంగా అభివృద్ధి చెందాలి : సుధాకర్ గాండే



కస్తూర్బాగాంధీ మహిళా కళాశాల గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న ప్రముఖ పారిశ్రామిక వేత్త సుధాకర్ గాండే

**అడ్డగుట్ట, మార్చి 31 ప్రభాతవార్త:** విద్యావంతులైన పట్ట భద్రులు ఐఏఎస్, ఐపిఎస్ ఐటీ వంటి డిగ్రీలు పొంది దేశాన్ని ప్రపంచ శక్తిగా నిలబెట్టేందుకు భాగస్వాములు కావాలని ప్రముఖ పారిశ్రామిక వేత్త సుధాకర్ గాండే పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలోని కస్తూర్బాగాంధీ మహిళా డిగ్రీ, పిజీ కళాశాలలో 2023-25 విద్యా సంవత్సరంలో ఎంబిఏ పూర్తి చేసుకున్న 115 మంది విద్యార్థులకు పట్టా సర్టిఫికెట్‌ల పంపిణీ స్నాతోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యావంతులైన యువతీ, యువకులు ప్రముఖ పారిశ్రామిక వేత్తలుగా ఎదిగి దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. మహిళా పట్ట భద్రులు లక్ష్యన్ని ఏర్పాటు చేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. రాజశ్రీ, ఎంబిఏ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ నీల గొల్లపూడి ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు కళాశాల కార్యదర్శి మహ్మద్ ఫహీముద్దీన్, సంయుక్త కార్యదర్శి జీఎం. రమేష్, కోశాధికారి డి. సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంబిఏ పూర్తి చేసుకున్న పట్ట భద్రులకు కాన్వ కేషన్ సర్టిఫికెట్లను సుధాకర్ గాండే చేతుల మీదుగా అందజేశారు.

## ప్రజల్లో ఉండేవారికి ప్రజాధరణ మెండుగా ఉంటుంది -ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



పర్వత్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా గెలుపొందిన రాజుయాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు.

**యూసుఫ్‌గూడ మార్చి 31 ప్రభాతవార్త :** అనునిత్యం ప్రజా సమస్యల కోసం పాటుపడే నాయకులకు, కార్యకర్తలకు ప్రజల్లో ఎప్పుడూ ఆధారాభిమానాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల పర్వత్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షునిగా గెలుపొందిన రాజు యాదవ్ మర్యాదపూర్వకంగా మంగళవారం వెళ్లి స్థానిక శాసన సభ్యులు మాధవరం కృష్ణారావును కలిశారు. అందుకు ఆయన రాజు యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. బస్తీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పర్వత్‌నగర్ మాజీ అధ్యక్షులు జాహెద్ షరీఫ్, తలసాని శ్రీనివాస్ యాదవ్, రాజు, దస్తగిర్, ప్రకాష్ పాల్గొన్నారు.

### 2న శక్కర్‌గంజ్‌లో హనుమ జయంతి

**చాంద్రాయణగుట్ట, మార్చి 31, ప్రభాతవార్త :** పాతబస్తీ శక్కర్‌గంజ్ శ్రీ దాస ఆంజనేయ స్వామి దేవాలయంలో ఏప్రిల్ 2వ తేదీ గురువారం హనుమ జన్మదినోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు కె. రవిరాజ్ తెలిపారు. ఆలయ అర్చక స్వాములచే ఉదయం 5.30గంటలకు స్వామివారికి అభిషేకం, సింధూర, ఆకుపూజ, వడమాల ధారణ, ఉదయం 11 గంటలకు మహా నైవేద్యం సమర్పణ ఉంటుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వెల్లడించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ఆ అంజనీ పుత్రుని అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు.

## ఉద్యోగిగా అందించే సేవలు మరవలేనివి



ఉద్యోగ విరమణ చేసి భాస్కర్‌ను సన్మానిస్తున్న చెన్నకేశవ దేవస్థానం మాజీ చైర్మన్ జుర్కి రాజేందర్ కుమార్, ఆలయ అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు

**చాంద్రాయణగుట్ట, మార్చి 31, ప్రభాతవార్త :** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో సీనియర్ ఆఫీసర్ కె. భాస్కర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం నగరంలో జరిగింది. చాంద్రాయణగుట్ట కేశవగిరి శ్రీ చెన్నకేశవ దేవస్థానం పాలక మండలి మాజీ చైర్మన్ జుర్కి రాజేందర్ కుమార్, ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు, భాస్కర్ దంపతులను పూలదండ, శాలువతో ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఎండోమెంట్ ఆఫీసర్‌గా భాస్కర్ అందించిన సహాయ సహకారాలను వారు గుర్తు చేసుకున్నారు. ఆలయ ఉన్నతిలో అతని సహకారం మరవలేదన్నారు. ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరు ఏదో ఒకరోజు ఉద్యోగ విరమణ చేయకతప్పదన్నారు. వారి సేవాలకంలో చేసిన మంచి పనులు జీవితకాలం గుర్తుండి పోతాయన్నారు. అతని శేష జీవితం ఆయురారోగ్యాలతో, సుఖఃశాంతులతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులకు తక్షణ స్పందన.. సమస్య పరిష్కారం



వివేకానంద్‌నగర్ కాలనీలో డ్రైనేజి సమస్యను పరిశీలిస్తున్న హెచ్ఎండబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, జనరల్ మేనేజర్ హరిశంకర్

**యూసుఫ్‌గూడ మార్చి 31 ప్రభాతవార్త :** అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శ్రీ వివేకానంద్‌నగర్ కాలనీ రోడ్డు నంబర్ 1 పరిధిలో గత కొన్ని రోజులుగా డ్రైనేజి లైన్ పొంగిపొర్లడంతో పాటు రైల్వే ట్రాక్ వెంబడి మురుగు నీరు నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సమీప ఇళ్లలోని బోర్‌వెల్స్‌లో కూడా డ్రైనేజి నీరు వస్తుందని ప్రజా వాణిలో స్థానిక సంక్షేమ సంఘం తరఫున ఫిర్యాదు చేయటం జరిగింది. ఈ ఫిర్యాదుకు స్పందించిన అధికార యంత్రాంగం మంగళవారం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న కలుషిత నీటి సమస్యను సత్వరమే పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గంగాధర్, డీజీఎమ్ శ్రీనాదరావు, మేనేజర్ అన్విత్‌కుమార్, వివేకానంద్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లు శ్రీనివాసరావు, కన్వీనర్ రోణంకి జగన్నాథం, రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

**గాయిత్రినగర్‌లో.......**

అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయిత్రినగర్ కాలనీలో గత 15 రోజులుగా రైల్వే ట్రాక్ ప్రాంతంలో డ్రైనేజి నీరు నిల్వ ఉండటంతో స్థానికంగా కాలనీ వాసుల బోర్లలో కలుషిత నీరు రావడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అప్పటి నుంచి సమస్యను పరిష్కరించాలంటూ స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు, ఇతర కమిటీ సభ్యులు విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కృష్ణారావు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. అదే విధంగా డ్రైనేజి నీరు ప్రవహించే వివేకానందనగర్ కాలనీ వాసుల దృష్టికి కూడా తీసుకు వెళ్లడం జరిగిందని అయినా పరిష్కారం కాకపోవడంతో చివరికి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన సంబంధిత అధికారులు మంగళవారం కాలనీలో పర్యటించి సమస్యను గుర్తించి తగిన విధంగా పనులు పూర్తి చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. మరోమారు ఇలాంటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు.

## బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేదు : శంబుల ఉషశ్రీ శ్రీకాంత్‌గౌడ్



ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షురాలు శంభుల శ్రీకాంత్‌గౌడ్

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త** బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేదని ఖైరతాబాద్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శంబుల ఉషశ్రీ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆల్ ఇండియా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాల మేరకు మంగళవారం అంబర్‌పేటలోని జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ పాలిత రాష్ట్రాలలో మహిళలకు, బాలికలకు రక్షణ కరువైందన్నారు. బిజెపికి చెందిన 44 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు మహిళలపైన అత్యాచార లైంగిక వేధింపుల కేసులో ఉన్నారని ఆరోపించారు. ఈ విషయంలో బిజెపి ప్రభుత్వంలోని మహిళా మంత్రులు కూడా ఎందుకు మౌనంగా ఉన్నారని ఆమె నిలదీశారు. మోదీ ప్రభుత్వ పాలనలో జరిగిన కొన్ని దాడులను గురించి ఆమె గుర్తుచేస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలపైన వెంటనే చట్టపమైన చర్యలను తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. బేటి పడావో బేటి బచావో అన్న మోదీ మీ పాలిత రాష్ట్రాలలో మహిళలకు, బాలికలకు రక్షణ ఎక్కడ ఉందని నిలదీశారు. ఇప్పటికైనా బిజెపి అగ్రనాయకత్వానికి చిత్తశుద్ధి ఉన్నట్లయితే ముందు బాధితులకు న్యాయం చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బాధితులకు న్యాయం లభించే వరకు దేశవ్యాప్తంగా మహిళా కాంగ్రెస్ పోరాటం కొనసాగుతూనే ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జీలు స్టేట్ వైస్ ప్రెసిడెంట్ సుగుణరెడ్డి, స్టేట్ జనరల్ సెక్రెటరీ వెంకటసుబ్బమ్మ, కార్వాన్ నియోజకవర్గం అధ్యక్షురాలు మాధవి, బ్లాక్ ప్రెసిడెంట్ వనజ, ప్రసన్న భారతి, డివిజన్ ప్రెసిడెంట్లు కవిత, అయేషా బేగం, అనురాధ, పద్మ, హేమలత, దుర్గా, వనజ తదితరులు పాల్గొన్నారు.

## డిజిటల్ విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు : ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి



బాగ్ లింగంపల్లి డా. బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో డిజిటల్ లర్నింగ్ అండ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్" అనే అంశంపై జాతీయ సదస్సులో పాల్గొన్న ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గద్దం నరేష్ రెడ్డి

**చిక్కడపల్లి మార్చి 31 ( ప్రభాతవార్త ) :** మారుతున్న కాలానికి అనుగుణంగా ఉన్నత విద్యలో సాంకేతికతను జోడించడం అనివార్యమని ఓస్మానియా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గద్దం నరేష్ రెడ్డి అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డా. బి.ఆర్. అంబేద్కర్ డిగ్రీ కళాశాలలో డిజిటల్ లర్నింగ్ అండ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఇన్ హయ్యర్ ఎడ్యుకేషన్" అనే అంశంపై నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సు ముగిసింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ నరేష్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగు పరుచుకోవడానికి స్వయం, మూక్స్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను విరివిగా ఉపయోగించుకోవాలని సూచించారు. అయితే, డిజిటల్ డివైడ్ (సాంకేతిక అసమానతలు) వంటి సవాళ్లను అధిగమించాల్సిన అవసరం ఉందన్నారు. సదస్సులో ప్రొఫెసర్ ఇంద్రకాంతి శేఖర్ మాట్లాడుతూ.. డిజిటల్ విద్య ప్రాముఖ్యతను వివరించారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యాబోధనలో మార్పులు., నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యత కల్పించడం, గ్రామీణ, పట్టణ విద్యార్థుల మధ్య ఉన్న డిజిటల్ వ్యత్యాసాన్ని తగ్గించడం, సాంకేతికతతోనే విప్లవాత్మక మార్పులు చేయాలనీ సూచించారు. ప్రొఫెసర్ డి. శ్రీరాములు, కళాశాల సీఈఓ ప్రొఫెసర్ లింబాద్రి, ప్రిన్సిపాల్ డా. మట్టా శేఖర్, వివిధ విభాగాల అధ్యాపకులు, దేశవ్యాప్తంగా వచ్చిన పేపర్ ప్రెజెంటర్లు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్షర నీరాజనం.. కళా ప్రస్థానానికి సమున్నత గౌరవం : పాశం యాదగిరి



అకాడమీ నూతన లోగోను ఆవిష్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి మార్చి 31 ( ప్రభాతవార్త ) :** భారతీయ సనాతన సంప్రదాయ కళల పరిరక్షణకు, కళాకారుల సంక్షేమానికి అంకితభావంతో కృషి చేస్తున్న కళాబంధు డాక్టర్ పి. అనూహ్య రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. సామాజిక సేవ, పారిశ్రామిక రంగం, చిత్ర పరిశ్రమ.. ఇలా బహుముఖ ప్రజ్ఞాశాలిగా రాణిస్తున్న ఆమె సేవలను గుర్తించి చినుకు కల్చరల్ సొసైటీ, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సన్మాన సభ నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతిష్టాత్మక ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కోవిదా ఆర్ట్స్ అండ్ కల్చరల్ అకాడమీ మధ్య కళారంగ అభివృద్ధిపై కుదిరిన చారిత్రాత్మక అవగాహన ఒప్పందం సందర్భంగా ఈ వేడుక అట్టహాసంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ ఉద్యమ ప్రముఖులు పాశం యాదగిరి మాట్లాడుతూ.. జానపద కళలను కాపాడటంలో ఆమె సంకల్పం గొప్పది. భవిష్యత్తులో తెలంగాణలో కూడా ఒక కళా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు ఆమె పూనుకోవాలి అని ఆయన ఆకాంక్షించారు. డాక్టర్ అనూహ్య రెడ్డి మాట్లాడుతూ.. నాగార్జున వర్సిటీ సహకారంతో భారతీయ సంప్రదాయ కళలను, సాహిత్య పరిశోధనలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లేందుకు కంకణబద్ధులై ఉన్నానని ప్రకటించారు. ఈ సందర్భంగా అకాడమీ నూతన లోగోను ఆవిష్కరించారు. చినుకు కల్చరల్ సొసైటీ ఫౌండర్ పి.ఎన్. మూర్తి, కవి భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించిన ఈ సభలో నాగార్జున వర్సిటీ ప్రతినిధులు ప్రొఫెసర్ గంగాధర్, రెక్టార్ ప్రొఫెసర్ శివరాం ప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం , చినుకు కల్చరల్ సొసైటీ సభ్యులు, వివిధ రంగాల గురువులు ఏ. అనుదీప్తి, జి. లావణ్య, డి. రాధిక, శ్రీనివాస్, రామలక్ష్మి, లక్ష్మీదేవి, వరుణ్ శర్మ తదితరులను డాక్టర్ అనూహ్య రెడ్డి ఘనంగా సత్కరించారు.

## పద్మానగర్ డ్రైనేజీ దుర్గంధం నుండి కాపాడండి: దేవరకొండ శ్రీనివాస్



కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పద్మానగర్ ఫేజ్-2అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, సత్తిరెడ్డి, కాలనీ వాసులు

**కుత్బుల్లాపూర్, మార్చి31 ప్రభాతవార్త** పద్మానగర్ ఫేజ్-2ను దుర్గంధభరితంగా మార్చిన డ్రైనేజీనుండి కాపాడి ప్రజలకు తోడ్పడాలని పద్మానగర్‌ఫేజ్2 వాసులు శాసనసభ్యులు కె.పి.వివేకానంద్‌కు మొరపెట్టుకున్నారు. మంగళవారం పద్మానగర్ ఫేజ్2సంక్షేమసంఘ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాస్, బిఆర్ఎస్ ప్రధానకార్యదర్శి సత్తిరెడ్డితో పాటు కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు పెద్దఎత్తున తరలి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా దేవరకొండ శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహం సమీపంలో తీవ్రమైన డ్రైనేజీ సమస్య కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కాలనీ అధ్యక్షులు దేవరకొండ శ్రీవాస్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్తిరెడ్డి, కిశోర్‌చారి, ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్, కార్యదర్శి శోభన్ కుమార్, నసీరుద్దీన్, ఆంజనేయులు, రమణారెడ్డిలు వినతిపత్రం ఇవ్వగా దీనికి స్పందించిన శాసనసభ్యులు వివేకానంద్ వెంటనే డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

## ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలి : ట్రాఫిక్ అడ్మిన్ ఏసిపి లక్ష్మణ్



ట్రాఫిక్ సైన్ బోర్డులు, ప్లకార్డులతో వెస్లీ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ లక్ష్మణ్.

**బేగంపేట మార్చి 31, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, రోడ్డుపైన మన బద్రతతో పాటు ఇతరుల బద్రతను కూడా దృష్టిలో ఉంచుకోవాలని ట్రాఫిక్ అడ్మిన్ ఏసీపీ లక్ష్మణ్ పిలుపు నిచ్చారు. సికింద్రాబాద్ వెస్లీ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. అలైవ్ అరైవ్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని వెస్లీ డిగ్రీ కళాశాల లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్‌రూట్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్, అతివేగం, ట్రిపుల్ రైడింగ్ వల్ల కలిగే ప్రమాదాల గురించి జీబ్రాలైన్స్ ఉపయోగించడం వల్ల కలిగే లాభాలు వివరించారు. రోడ్డుపై అప్రమత్తంగా ఉంటూ డ్రైవింగ్ చేయాలన్నారు. బాధ్యతగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చన్నారు. టీటీఐ ఇన్స్‌పెక్టర్ నాగుల అశోక్ మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనాలు నడపాలన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాల లోపు వారు వాహనాలు నడపవద్దన్నారు. బస్సు, ఆటో, కార్లు ఎక్కేసమయంలో కూడా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సైన్ బోర్డులు, ప్లకార్డులు ఉపయోగించి ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో 250మంది విద్యార్థులు, కళాశాల సహాయ ఆచార్యులు శ్రావిన్ కృపాకర్, జయరాజ్, జె. అజయ్‌కుమార్, టీటీఐ బేగంపేట సిబ్బంది కృష్ణ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహాలక్ష్మి పథకంలో 290 కోట్ల మహిళలకు ఉచిత ప్రయాణం : ఎమ్మెల్యే శ్రీగణేష్



సికింద్రాబాద్ జెబిఎస్‌లో మహా లక్ష్మి పథకం వేడుకల్లో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 24 గంటలలోపే మహిళా సోదరీమణులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం చేసేందుకు మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించి 290 కోట్ల ఉచిత ప్రయాణం ద్వారా 10 వేల కోట్ల రూపాయలు మహిళలకు ఆదా చేసుకున్నారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా . .ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి స్కీమ్‌లో భాగంగా 290 కోట్ల మహిళా ప్రయాణికులు ప్రయాణం చేసినందుకు మంగళవారం సికింద్రాబాద్ జెబిఎస్‌లో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రతి రోజు ఆర్టీసీ బస్సుల్లో సురక్షితంగా ప్రయాణం చేస్తూ వారి వారి వ్యక్తిగత పనులు ముగించుకొని గమ్య స్థానానికి చేరుకుంటున్న మహిళా సోదరి మనులను ఎమ్మెల్యే శ్రీగణేష్ ఘనంగా సత్కరించి కాంగ్రెస్ పార్టీ చేపడతున్న సంక్షేమ పథకాలు, కోటి మంది మహిళలు కోటీశ్వరులుగా చేయాలనే లక్ష్యం వంటి ఆంక్షలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ రంగారెడ్డి జిల్లా రీజినల్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ ఆర్.ఎం. సరస్వతీ, పికెట్ డిపో మేనేజర్ ఎల్. రవిందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత క్రైస్తవులకు సమాన హక్కులు కల్పించాలి : ఏఐయూసీఎంఈఆర్



ఎమ్మార్పీఎస్ అధినేత మందకృష్ణ మాదిగను కలిసిన తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పోస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్

**చిక్కడపల్లి మార్చి 31 ( ప్రభాతవార్త ) :** దళిత క్రైస్తవుల దశాబ్దాల డిమాండ్‌కు మద్దతు పలికిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంద కృష్ణ మాదిగకు ఆల్ ఇండియా యునైటెడ్ క్రిస్టియన్ మూవ్‌మెంట్ ఫర్ ఈక్వల్ రైట్స్ అధ్యక్షుడు జోస్ డేనియల్, తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్ పోస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గొనె సల్మాన్ రాజ్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ క్రైస్తవ సమాజంలోనూ, బయట సమాజంలోనూ దళిత క్రైస్తవులకు జరుగుతున్న అన్యాయాన్ని మంద కృష్ణ మాదిగ ఖండించడాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. గతంలో బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్, కాన్షీరామ్, మాయావతి, రామ్ విలాస్ పాశ్వాన్ వంటి నాయకులు కూడా దళిత క్రైస్తవులకు సమాన న్యాయం కావాలని ఆకాంక్షించారని వారు గుర్తు చేశారు. బిషప్ వీరాజీ పి. ఇజ్రాయెల్ మాట్లాడుతూ మండల్ కమిషన్, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ వంటి అనేక రాష్ట్ర, కేంద్ర కమిషన్లు దళిత క్రైస్తవుల సమస్యలను గుర్తించాయని, ఇతర మతాల్లోని ఎస్సీలతో సమానంగా వీరు కూడా సామాజిక వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. 1950 నాటి ప్రెసిడెన్షియల్ ఆర్డర్ (షెడ్యూల్డ్ కులాల ఉత్తర్వు) లోని పారా3 రాజ్యాంగంలోని అధికరణలు 14, 15, 25లను ఉల్లంఘిస్తోందని మంద కృష్ణ మాదిగ చేసిన వ్యాఖ్యలను సమర్థించారు. ఆర్టికల్ 341 ప్రకారం అంటరానితనం ఎదుర్కొంటున్న కులాలను గుర్తించడమే రాష్ట్రపతి బాధ్యత అని, అయితే పారా3 ద్వారా మతం అనే అదనపు నిబంధనను చేర్చడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఆయన స్పష్టం చేశారు. మతంతో సంబంధం లేకుండా దళితులందరికీ ఎస్సీ రిజర్వేషన్లు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు.

### వాహనదారులు రోడ్డు భద్రతా సూత్రాలను పాటించాలి : సిఐ



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ద్విచక్రవాహన దారులతో సమావేశమైన తుకారాంగేట్ సిఐ శ్రీకాంత్ రెడ్డి తదితరులు

**కంటోన్మెంట్, మార్చి 31 ప్రభాతవార్త:** వాహన దారులు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా సూత్రాలను పాటిస్తూ డ్రైవింగ్ చేయాలని తుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ రెడ్డి సూచించారు. మంగళవారం రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ఏర్పాటు చేసిన రోడ్డు భద్రతలపై నిర్వహించిన అవగాహన సదస్సులో పలు సూచనలు ఇచ్చారు. సెల్ ఫోన్‌డ్రైవింగ్ చేయకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, రోడ్డు భద్రతా సూత్రాలు తుచా తప్పకుండా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు కిరణ్ కుమార్ రెడ్డి, యశోదర్ పాల్గొన్నారు.

## వైద్య అవసరాలకు సిఎంఆర్ఎఫ్ సహాయం



లబ్ధిదారులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను పంపణి చేసిన ఎమ్మెల్యే

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** గోల్నాకలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ 54 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి ఉపశమన నిధి (సిఎంఆర్ఎఫ్) ద్వారా చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా మొత్తం లబ్ధిదారులకు 18 లక్షల 81 వేల 500 రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు ముఖ్యంగా వైద్య అవసరాల సమయంలో సిఎంఆర్ఎఫ్ సహాయం ఎంతో ఉపయుక్తమన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ సహాయం సమయానికి అందించిన ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

### టిఎన్‌జిఓ ఉద్యోగుల హక్కుల కోసం పాటుపడతాం



టి.ఎన్.జి.ఓ కేంద్ర, సంఘం, అధ్యక్ష, కార్యదర్శులకు సన్మానం

**గోషామహల్, మార్చి 31ప్రభాతవార్త:** టి.ఎన్.జి.ఓ తెలంగాణ ఉద్యోగుల హక్కుల కోసం కృషి చేస్తానని కేంద్ర సంఘం రెండవ సారి అధ్యక్షులుగా ఎన్నికైన మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేనీ ముజీబ్‌లు అన్నారు. ఈ మేరకు రెండవ సారి ఎన్నికైన మారంజగదీశ్వర్, డాక్టర్ ముజీబ్‌హుస్సేనీలను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో అసోసియేట్‌అధ్యక్షులుగా కస్తూరి వెంకటేశ్వర్లు, ముత్యాల సత్యనారాయణగౌడ్, కోశాధికారి ఉమాదేవి, హైదరాబాద్‌జిల్లా అధ్యక్షులు విక్రమ్‌కుమార్, కార్యదర్శి కుర్రాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షులు కె.ఆర్ రాజ్‌కుమార్, కోశాధికారి బాలరాజు, ఖలీద్‌అహ్మద్, శంకర్, గీతా, ముఖీంఖురేషీ, శ్రీధర్, ఇ.ఎన్‌టి రాజులతోపాటు వివిధ యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

### స్వచ్ఛంద సంస్థలు రక్తదానం కోసం ముందుకు రావాలి



రక్తదానం చేసిన ఉస్మానియా, దంతకళాశాల వైద్యులు

**అఫ్జల్‌గంజ్, మార్చి 31ప్రభాతవార్త:** ప్రాణా ప్రాయస్థితిలో ఉన్న వారిన్ని ఆదుకునేందుకుగాను యువతి, యువకులతోపాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని ఉస్మానియా ఆసుపత్రిసూపరిండెంటెంట్ డాక్టర్ రాకేష్ సహాయ్, దంతకళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్. యాదవ్‌లు అన్నారు. మంగళవారం ఉస్మానియా ఆసుపత్రి, దంత కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిభిరం నిర్వహించారు. ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు, దంత కళాశాల ప్రిన్సిపల్ ఎస్.ఎస్ యాదవ్ కూడారక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో ఆయా ఆసుపత్రుల ఆర్.ఎం.ఓ వైద్యులు జగదీష్, జయకృష్ణ, ఉమాదేవి, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

### సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుధాకర్‌కు సన్మానం



సుధాకర్ ను సన్మానిస్తున్న బీజేపీ నాయకుడు ఆనంద్ తదితరులు.

**బేగంపేట మార్చి 31, ప్రభాతవార్త** సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా ఎన్నికైన న్యాయవాది సుధాకర్ ను సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ ఆధ్వర్యంలోని బీజేపీ నాయకుల బృందం ఘనంగా సన్మానించింది. ఇటీవల సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ కు జరిగిన ఎన్నికల్లో సికింద్రాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన సుధాకర్ ను సికింద్రాబాద్ లోని ఆయన కార్యాలయంలో కల్సి సన్మానించారు. ఈ సందర్భంగా నెమలి ఆనంద్ మాట్లాడుతూ న్యాయ వాదుల నూతన అధ్యక్షుడు సుధాకర్ నేతృత్వంలో న్యాయవాదులకు మంచి జరుగుతుందన్న నమ్మకాన్ని వ్యక్తం చేసారు. న్యాయ వాదుల ఆశలు, ఆకాంక్షలకు ప్రతిబింబమని ,పారదర్శకత, న్యాయం కోసం కట్టుబడి పని చేసే నాయకత్వానికి ఇది నిదర్శనమని తెలిపారు. ఆయన నాయకత్వంలో బార్ అసోసియేషన్ మరింత బలపడుతూ ,న్యాయ వాదుల హక్కుల పరిరక్షణలో ముందంజలో నిలుస్తుందన్న విశ్వాసాన్ని నెమలి ఆనంద్ వ్యక్తం చేసారు. సుధాకర్ ను సన్మానించిన వారిలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యులు సురేష్ రావల్, సీనియర్ నాయకులు బీరాం నర్సింగ్ రావు, మైసూర్ మధుసూదన్, పెద్ది అనిల్, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మహాలక్ష్మి పథకం విజయోత్సవాలు

**బేగంబజార్, మార్చి 31ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం విజయోత్సవాలను మహాత్మాగాంధీ బస్‌స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. అదే విధంగా మహిళలు ఈ పథకం ప్రయోజనాలను సద్వినియోగం చేసుకుని, ప్రయాణ ఖర్చులో ఆదా అయ్యే మొత్తాన్ని తమ కుటుంబాల సంక్షేమం, మెరుగైన జీవన విధానానికి వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిజిఎస్‌ఆర్‌టిసి సేవలను వినియోగిస్తున్న ఐదు మహిళా ప్రయాణికులను సత్కరించి శాలువ కప్పి జ్ఞాపికలను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (హెచ్‌జెడ్)కు ఖ్రోషాఖాన్, రీజినల్ మేనేజర్(ఆర్ఆర్)శ్రీలత, డిప్యూటి రీజినల్ మేనేజర్(మెయింటెన్స్)సుగుణాకర్, డిప్యూటి రీజినల్ మేనేజర్(ఆపరేషన్)సరస్వతి తదితరులు పాల్గొన్నారు. కాగా చి. రమేశ్వరి సూపరిండెంట్‌హెల్త్‌డిపార్ట్‌మెంట్, పి. నీలిమ ఎ.ఎన్.ఎం హెల్త్ డిపార్ట్‌మెంట్, ప్రైవేట్ ఉద్యోగి ఎం. మౌనిక, ఆశావర్కర్ ఎస్. అరుణ, విద్యార్థిని కుమారిజోష్నాలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో తొలిసారిగా 'మెగా గ్లోబల్ సమ్మిట్-అట్లెగ్-2026'



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బండారి

**సైఫాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** ది గ్లోబల్ అకాడమీ ఆఫ్ లా-టెక్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (గాల్టర్) ఆధ్వర్యంలో హైదరాబాగ్ నగర చరిత్రలో తొలిసారిగా ఏ ప్రిల్ 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు బేగంపేటలోని టూరిజం ప్లాజాలో 'మెగా గ్లోబల్ సమ్మిట్-అట్లెగ్-2026' నిర్వహిస్తున్నామని గాల్టర్ వ్యవస్థాపకులు ప్రొఫెసర్ డా. బండారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ సమ్మిట్‌కు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సమ్మిట్‌లో అమెరికా, యూకె, జపాన్, జర్మనీ, ఇటలీ తదితర దేశాలకు చెందిన ఆనేక మంది నిపుణులు 200 మందికిపైగా పాల్గొని 75కిపైగా ప్రజెంటేషన్‌లు సమర్పించనున్నారని ఆయన చెప్పారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స, సైబర్ సెక్యూరిటీ, డేటా ప్రైవసీ, బ్లాక్ చెయిన్ వంటి అధునిక సాంకేతిక అంశాలపై మూడు రోజుల పాటు చర్చలు జరుగుతాయన్నారు. ఈ సమ్మెట్‌లో ముఖ్యఅతిధులుగా సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, మాజీ న్యాయమూర్తులు, ప్రముఖ న్యాయవాదులు, అంతర్జాతీయ నిపుణులు పాల్గొని కీలక అంశాలపై సూచనలు చేస్తారన్నారు. సమ్మిట్ ప్రతినిధి, న్యాయవాది ప్రతిభ మాట్లాడుతూ ప్రొఫెసర్ బండారి రచించిన పుస్తకావిష్కరణ జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో మీడియా కో-ఆర్డినేటర్ రాజ్ కూడా పాల్గొన్నారు.

## న్యాయవాదుల రక్షణ చట్టం తేవటం అభినందనీయం

**తెలంగాణ అడ్వకేట్ జెఏసి నాయకులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి**



తెలంగాణ ప్రభుత్వంకు ధన్యవాదములు తెలియచేస్తున్న న్యాయవాదులు

**ముషీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** తెలంగాణ న్యాయవాదులు చేస్తున్న పోరాటాన్ని గుర్తించి, తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ న్యాయవాదుల రక్షణ చట్టం-2026 తీసుకురావటం అభినందనీయమని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ నాయకులు పులిగారి గోవర్ధన్‌రెడ్డి కొనియాడారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటుచేసిన న్యాయవాదుల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, వారి మంత్రి వర్గానికి కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ సందర్భంగా గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో న్యాయవాదులకు ఇచ్చిన హామీని అమలుచేసిన తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదములు తెలియచేస్తున్నామని అన్నారు. న్యాయవాదుల రక్షణ చట్టం వల్ల వృత్తి పరంగా న్యాయవాదులపై జరిగే దాడులు అరికట్టబడతాయని, న్యాయవాదులు తమ వృత్తి ధర్మాన్ని ధైర్యంగా, నిర్భయంగా కొనసాగించేందుకు ఈ చట్టం ఎంతో అండగా ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిషనయత్తులో న్యాయవాదులు కూడా నైతిక బాధ్యతతో కూడిన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, చట్టం ముందు అందరూ సమానమనే విషయాన్ని మర్చిపోకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో నూతనంగా ఎన్నుకోబడిన న్యాయవాదుల సంఘం నేతలు గోలి వష్లవ్‌రెడ్డి, వడియారం రవికుమార్, పిఠం ప్రదీప్‌కుమార్, పి.అనిల్ కుమార్, జి.సత్యనారాయణ, పి.రాంచందర్ మరియు ఇతర న్యాయవాదుల పాల్గొన్నారు.

## జ్యోతిబా పూలే దంపతుల విగ్రహాల ఏర్పాటు నిర్ణయం చారిత్రాత్మకం

**బిసి రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్**

**ముషీరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** ట్యాంక్‌బండ్‌పై బీసీ మహనీయులైన జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఏర్పాటుచేయాలని, తెలంగాణ ప్రభుత్వం నిర్ణయింటం అభినందనీయమని, ఇది తెలంగాణ సామాజిక న్యాయచరిత్రలో గొప్ప మైలురాయిగా నిలుస్తుందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. విగ్రహాల ఆవిష్కరణ కోసం మంగళవారం ఏర్పాటుచేసిన బీసీ నాయకుల పర్యవేక్షణ కార్యక్రమంలో పాల్గొన్న దాసు సురేష్ ఏప్రిల్ 11న విగ్రహాలను ఆవిష్కరిస్తామన్న బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటనపై హర్షం వ్యక్తం చేశారు. బీసీ మహనీయుల గొప్ప సేవలను గుర్తించి, వారి విగ్రహాలకై అర ఎకరం భూమి కేటాయించటంతో పాటు నాలుగు కోట్ల రూపాయల నిధులను విడుదల చేయటం, బీసీ సమాజానికే గర్వకారణమని కొనియాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో బీసీల రాజ్యాధికార ఆకాంక్ష, తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి వంటి ప్రధాన అంశాలు చర్చకు రావటం శుభపరిణామమని, పార్టీలకు అతీతంగా బీసీ ప్రజా ప్రతినిధులు అందరూ ఒకే వేదికపైకి వచ్చి, బీసీ సమస్యలపై శాసనసభలో విస్తృతస్థాయి చర్చ జరిగేవిధంగా కృషి చేయాలని కోరారు. అదేవిధంగా బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సభ్యులుగా శాసనసభలో ప్రత్యేక బీసీ కమిటీలను ఏర్పాటుచేసి, బీసీలకు బడ్జెట్ సబ్ ప్లాన్, ప్రత్యేక రక్షణ చట్టం, చట్టసభల్లో రిజర్వేషన్లు, మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు సబ్‌కోటా వంటి అంశాలపై మరింత ధృడంగా పోరాడాలని విజ్ఞప్తి చేశారు.

## సంక్షేమ సంఘాలు అభివృద్ధిలో ముందుండాలి : బండి రమేష్



సంక్షేమ సంఘం సభ్యులను అభినందిస్తున్న బండి రమేష్

**కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 30, ప్రభాతవార్త**

సంక్షేమ సంఘాలు, అసోసియేషన్లు బస్తీ సమస్యల పరిష్కారంలో ముందుండాలని స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండి పార్టీకి మంచి పేరు తీసుకురావాలని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సూచించారు. ఆదివారం జరిగిన పర్వత నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో పార్టీకి చెందిన రాజారావు వర్గం విజయం సాధించింది. ఈ అసోసియేషన్ సభ్యులు మంగళవారం బండి రమేష్‌ని కూకట్‌పల్లిలోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రమేష్ వారిని అభినందించారు. పర్వత నగర్‌లో నెలకొన్న సమస్యలను అసోసియేషన్ సభ్యులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కాలనీ అభివృద్ధికి సహకరించవలసిందిగా కోరారు. దీనిపై రమేష్ స్పందిస్తూ బస్తీతోపాటు నియోజకవర్గం అభివృద్ధికి తన సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాజరావ్ యాదవ్, వాసు, నరేష్, భర్కత్ అలి పాల్గొన్నారు.

## దూలపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థుల అద్భుత ప్రతిభ



గెలుచుకున్న పతకాలతో విద్యార్థులు

**కొంపల్లి, మార్చి 31, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దూలపల్లి విద్యార్థులు విద్యతో పాటు వివిధ సహపాఠ్య కార్యక్రమాలలో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచి పేరు తీసుకొస్తున్నారు.గత నాలుగు నెలలుగా ఆరో తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యార్థులకు యోగా ట్రైనర్ మమత మార్గదర్శకత్వంలో యోగాభ్యాసం అందించబడుతోంది. ఈ శిక్షణ ఫలితంగా గచ్చిబౌలి స్టేడియంలో నిర్వహించిన హ్యాకథాన్ యోగా కార్యక్రమంలో విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శన చేసి మొత్తం 18 పతకాలు సాధించారు. అందులో 6 బంగారు, 7 వెండి, 5 కాంస్య పతకాలు గెలుచుకొని పాఠశాలకు గర్వకారణమయ్యారు. ఈ సందర్భంగా యోగా ట్రైనర్ మమతని ఘనంగా సన్మానించారు.ఇటీవల నిర్వహించిన మరో కార్యక్రమంలో 8వ తరగతి విద్యార్థిని శ్రీలత ప్రతిరోజూ పాఠశాలకు హాజరవుతూ 90 శాతం కంటే ఎక్కువ హాజరు నమోదు చేసినందుకు ఎస్‌బీఐ సాకారం కార్యక్రమం ద్వారా కలెక్టర్‌రేటులో సైకిల్ బహుమతిగా అందుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. వేణుగోపాల్ ఆమెను అభినందించారు.అదేవిధంగా దుండిగల్ మండలంలో నిర్వహించిన మేడ్చల్ జిల్లా మోడల్ పార్లమెంట్ సమావేశంలో పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం మరో విశేషంగా నిలిచింది. ఈ విజయానికి కృషి చేసిన సోషల్ స్టడీస్ ఉపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులను అభినందించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, యోగా, సహపాఠ్య కార్యక్రమాలలో ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు కీర్తి తీసుకురావడం ఆనందదాయకమని తెలిపారు. ఇందుకు కృషి చేసిన ఉపాధ్యాయులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## కార్మికుల హక్కుల పరిరక్షణే ధ్యేయం : మొగుళ్ళ రాజిరెడ్డి

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త**

కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తాను ఎల్లప్పుడూ ముందుండి పోరాటం చేస్తానని ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు,జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ళ రాజిరెడ్డి తెలిపారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మొగుళ్ళ రాజిరెడ్డిను, జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి టీ.పి రాఘవేంద్ర రాజ్‌ను ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం జలమండలి కేంద్ర కార్యాలయంలో జలమండలి ఉద్యోగులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు డా. జి.సంజీవరెడ్డి తనపై నమ్మకంతో రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడుగా నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల హక్కుల పరిరక్షణే తన ప్రధాన ధ్యేయమని, ఉద్యోగులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యపై గళమెత్తి, న్యాయం జరిగే వరకు తన పోరాటం ఆగదని ప్రకటించారు. జలమండలి ఉద్యోగుల జనరల్ ట్రాన్స్‌ఫర్ విషయంలో,ఓటీ కాంపోజిషన్, ఉద్యోగుల ప్రమోషన్ అంశాల్లో తెలంగాణ జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ కీలక పాత్ర పోషించి, కార్మికుల ప్రయోజనాలను కాపాడిందని గుర్తు చేసారు. త్వరలో అన్ని డివిజన్ ల



ఐఎన్‌టియుసి రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడుగా నియమితులైన మొగుళ్ళ రాజిరెడ్డిను సన్మానిస్తున్న కార్మిక నేతలు

పర్యటన చేపట్టి, ప్రతి డివిజన్‌లోని సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు. జలమండలి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అసోసియేట్ ప్రెసిడెంట్ సి.సతీష్ కుమార్ మొగుళ్ళ రాజిరెడ్డి మరింత సమర్థవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ తెలంగాణ అధ్యక్షుడు కె.రాజ్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికుల ఐక్యతే మన బలం అన్నారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అసోసియేట్ ప్రెసిడెంట్ అల్లి శ్రవాన్ కుమార్, ఎండీ జాంగిర్, ప్రధాన కార్యదర్శి ఈ.చెంద్రశేఖర్, కె.ఆనంద్ రెడ్డి, బి.శంకర్ ప్రకాష్, బి.నర్సింగ్ రావు, ఏ.అశోక్, సైద్ హోసిం, మోతి రామ్, సి.రాజు, అజయ్ నాథ్, శ్రీనివాస్ యాదవ్, రాములు ముదిరాజ్, నియామత్ అలీ, మొగులయ్య, బాల రాజ్, పాండు, మన్సూర్ అలీ,షేర్ బహదూర్, బి.అశోక్, టీ. రాజు, బి. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలకు ఊపు

**కొంపల్లి, మార్చి 31, ప్రభాతవార్త**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలను పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బడిబాట కార్యక్రమంలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దూలపల్లిలో కార్యక్రమాలను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నికోలస్ ఆదేశాల మేరకు పాఠశాలలో పాంప్లెట్ విడుదల, బ్యానర్ ఆవిష్కరణతో బడిబాట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి దూలపల్లి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతను తెలియజేశారు.ఈ కార్యక్రమం కొనసాగింపుగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి డోర్ టు డోర్ సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య, క్రీడలు, ఇతర సౌకర్యాల గురించి వివరించారు. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యా



పాంప్లెట్ విడుదల, బ్యానర్ ఆవిష్కరణ చేస్తున్న దృశ్యం

ర్థులను కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ప్రోత్సహించారు.విద్యార్థులు ప్లకార్డులు పట్టుకుని గ్రామంలో అవగాహన కల్పిస్తూ మన పాఠశాల – మన భవిష్యత్ అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

## పేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

**నిజాంపేట్, మార్చి 31, ప్రభాతవార్త**

నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను మంగళవారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పంపిణీ చేశారు.కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా నిజాంపేట్, బాచుపల్లి, సూరారం ప్రాంతాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు నిజాంపేట్, రాజీవ్ గృహకల్ప వాసులు విజయ ఏనుగులకి రూ.19,000,బాచుపల్లి వాసులు, వాసుదేవ రెడ్డి పోలీస్‌కి రూ.60,000, రాజేశ్వర్ రెడ్డి అడ్డుకి రూ. 60,000, పోచారం కీర్తికి రూ.44,500, సూరారం వాసులు యలం వినోదాకి రూ. 60,000 వరకు చెక్కులు అందించారు.ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అత్యవసర సమయంలో ఎంతో ఉపయుక్తంగా నిలుస్తోందని తెలిపారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్య కర్తలు పాల్గొన్నారు.

## రవీంద్ర భారతి స్కూల్లో స్పెషల్ సర్టిఫికెట్ల పంపిణీ



విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసిన దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, మార్చి 31, ప్రభాతవార్త:**

అమీర్ పేట్ డివిజన్ పరిధిలోని ఎస్ ఆర్ నగర్ రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం స్పెషల్ సర్టిఫికెట్ డిస్ట్రిబ్యూషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా. ఎన్. రవీందర్ గౌడ్ హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించి, ముఖ్యంగా తెలుగు భాషలో విద్యార్థులు మంచి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యతోనే భవిష్యత్తు నిర్మాణం సాధ్యమవుతుందని, కృషి, క్రమశిక్షణతో ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు స్పెషల్ సర్టిఫికెట్స్‌ను ప్రధానం చేశారు. కార్యక్రమంలో డీఎన్ శ్రీలత, డిఎ హాదీ మహ్మద్, ప్రిన్సిపల్ సరిత,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటి బయట ఆడుకుంటూ బాలిక అదృశ్యం..

**సంజీవరెడ్డి నగర్, మార్చి 31, ప్రభాతవార్త:**



గోసాయి పూజ (ఫైల్ ఫోటో)

సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 11 సంవత్సరాల బాలిక అదృశ్యమైన ఘటన చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ అశోక్ తెలిపిన వివరాల ప్రకారం, ఇందిరాగాంధీపురం ప్రాంతానికి చెందిన కుమారి గోసాయి పూ జ సోమవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇంటి బయట ఆడుకుంటూ కనిపించకుండా పోయింది. బాలిక అదృశ్యమవడంతో భయాందోళనకు గురైన తల్లి దండ్రులు వెంటనే సనత్‌నగర్ పోలీసులను ఆశ్రయిం చారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.అదృశ్యమైన బాలిక ఆచూకీ ఎవరికైనా తెలిసినట్లయితే వెంటనే సనత్‌నగర్ పోలీ స్స్టేషన్‌ను సంప్రదించాలని ఇన్స్పెక్టర్ అశోక్ ప్రజలను కోరారు.

## చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు



చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో పూజలు నిర్వహించిన శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ దూద్‌బౌలి శాఖ ప్రతినిధులు

**చార్మినార్,మార్చి 31 ప్రభాతవార్త :** చార్మినార్ శ్రీ భాగ్యలక్ష్మీ మందిరంలో మంగళవారం శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ దూద్‌బౌలి శాఖ ఆధ్వర్యంలో మన అమ్మకు మన సారె మనసారా కార్యక్రమంలో భాగంగా శ్రీ భాగ్యలక్ష్మీ అమ్మ వారికి భక్తులు వడి బియ్యం, పండ్లు.చీర,సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దూద్‌బౌలి ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు డి.ఆనంద్ గప్తా,శ్రీ శైవ క్షేత్ర వనితా శక్తి ఇంటర్నేషనల్ దూద్‌బౌలి శాఖ ప్రతి నిధులు పద్మజ, రాధి క, అనిత,విష్ణుప్రియ,లోక పావనీ,స్వప్న ,భాగ్య, చండిక, క్రిష్ణవేణి,ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు సంతోష్, సత్యం,ప్రభాకర్,లక్ష్మణ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసిన పాతబస్తీ కాంగ్రెస్ నాయకులు

**చార్మినార్,మార్చి 31 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లును ఆమోదించిన సందర్భంగా మంగళవారం రాష్ట్ర బి.సి.సంక్షేమం,రవాణా ఖాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్ పులిపాటి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువతో సన్మానించి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పులిపాటి రాజేష్ కుమార్,హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి ఉపాధ్యక్షులు మీర్ మహమ్మద్ అలీ షాన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి న్యాయవాది జాకీర్ హుస్సే న్,బహదూర్‌పుర నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఫయాజ్ నాయకులు పాల్గొన్నారు.

## కార్వాన్‌లో రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



జోనల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న పడాల అనంతకృష్ణ

**కార్వాన్,మార్చి31(ప్రభాతవార్త)** కార్వాన్ లోని పరిసర ప్రాంతాలల్లో నడవడానికి కుడా వీలు లేని నంతగా గోతుల మాయమై,దెబ్బతిన్న రోడ్ల కారణంగా ప్రయాణికులు,పాఠశాల విద్యార్థులు,వృద్ధులు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కొంటున్నారని భారతీయ జనతా పార్టీగోల్కొండ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల అనంత కృష్ణ ఆవేదన వ్యక్తం చేస్తూ సంబంధిత మున్సిపల్ జోనల్ కమిషనర్ జి.ముకుంద రెడ్డిని మర్యాద పూర్వకంగా కలసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భముగా పడాల అనంత కృష్ణ మాట్లాడుతూ..కార్వాన్ నియోజకవర్గంలోని ముఖ్యంగా కార్వాన్ లోని ఆంద్రున్ కార్వాన్ పరిసర ప్రాంతాలల్లో గోతులమయమై దెబ్బతిన్న రోడ్ల కారణంగా వాహనదారులు,ప్రయాణికులు,పాఠశాల విద్యార్థులు,వృద్ధులు అదుపు తప్పి పడి గాయాల పాలైన సందర్భాలు చాలా ఉన్నాయని,వీలైనంత త్వరగా రోడ్ల మరమ్మతులు జరిగేలా తక్షణ అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు.జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించి ప్రజల భద్రత,సౌకర్యం దృష్టిలో ఉంచుకొని తక్షణ చర్యలకు అధికారులను ఆదేశించారని పేర్కొన్నారు.

## అంబేద్కర్ వర్సిటీలో జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

**జూబ్లీహిల్స్, మార్చి 31, ప్రభాతవార్తః**

డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, ఆర్థికశాస్త్ర విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చంచల్‌గూడ ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో "ఆర్థిక సంస్కరణలు, భారత రాజ్యాంగం- విభేదాలు, భవిష్యత్ దిశ" అనే అంశంపై నిర్వహించనున్న రెండు రోజుల జాతీయ సదస్సుకు సంబంధించి బ్రోచర్‌ను విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్థిక సంస్కరణలు రాజ్యాంగ పరిమితులతో సమన్వయం సాధిస్తూ సమగ్ర, సమాన అభివృద్ధిని సాధించడం అత్యవసరమన్నారు. ఏప్రిల్ 9-10 తేదీల్లో విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించే ఈ ఈ సదస్సు ద్వారా ఆర్థిక సంస్కరణలు, రాజ్యాంగ పరిమితుల మధ్య ఉన్న సంబంధాలు, సవాళ్లు, అలాగే భవిష్యత్ అవకాశాలపై లోతైన చర్చలు జరగనున్నాయని సెమినార్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వర్లు



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఆచార్య ఘంటా చక్రపాణి తదితరులు.

తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొ.జి. పుష్పా చక్రపాణి, సామాజిక శాస్త్రాల విభాగ డీన్ ప్రొఫెసర్ పల్లవి కాబ్దే, ఆర్థిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ కృష్ణారెడ్డి, ఓఎస్డీ రవీంద్రనాథ్ సోటమన్, చంచల్‌గూడ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఆచార్య శ్రీదేవి, ఆచార్య నాగోజి, డాక్టర్ జే మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలి

**పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డికి ఆహ్వానం**

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త**

రాజేంద్రనగర్‌లో వచ్చే నెల 4వ తేదీన జరిగే హిందూ సమ్మేళనంకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.ఈ సందర్భంగా సమ్మేళనం విజయవంతం కోసం నిర్వాహకులు పెద్దఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం నిర్వహక కమిటీ ప్రతినిధులు బాలరాజ్, అమరేందర్, శ్రీకాంత్, వేముల రామ కృష్ణ తదితరులు పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డిని కలిశారు. ఈ సమ్మేళనంలో హాజరుకావాలని కోరుతూ ఆయనకు ఆహ్వాన పత్రిక అందించి హిందూ సమ్మేళనం ప్రముఖ్యతను వివరించారు. హిందువులను ఒక తాటిపైకి తెచ్చి సనాతన ధర్మం పరిరక్షణ కోసం భవిష్యత్ తరాలకు ఆధ్యాత్మిక విలువలు అం



పద్మభూషణ్ వరప్రసాద్‌రెడ్డికి హిందూ సమ్మేళనం కరపత్రిక అందజేస్తున్న నిర్వాహకులు బాల్‌రాజ్,వేముల రామకృష్ణ, అమరేందర్ తదితరులు

దించేందుకు హిందూ సమాజం ఐక్యంగా ముందుకు సాగాలన్న దయ్యంతో హిందూ సమ్మేళనం నిర్వహిస్తున్నామని నిర్వాహక కమిటీ ప్రతినిధి, బిసి విద్యార్థి జెఏసి ఛైర్మన్ వేముల రామకృష్ణ పేర్కొన్నారు. హిందూ సమ్మేళనంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## విశేషంగా ప్రారంభమైన సినర్జియా 2026 ఉత్సవం

**నిజాంపేట్, మార్చి 31, ప్రభాతవార్త**



సినర్జియా 2026 ప్రారంభోత్సవ కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో జరిగింది. ఈ వేడుకకు అధ్యాపకులు, ప్రముఖ అతిథులు, విద్యార్థులు భారీగా హాజరయ్యారు. సుమారు 1000 మంది విద్యార్థులు పాల్గొనగా, దేశవ్యాప్తంగా 60 కాలేజీల నుంచి వచ్చిన విద్యార్థులు ఒకే వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవంలో మొదటి రోజు సాంకేతిక కార్యక్రమాలు, రెండవ రోజు సాంస్కృతిక కార్యక్రమాలు, మూడవ రోజు కళాశాల వార్షికోత్సవం నిర్వహించనున్నారు. తొలి రోజు కోడింగ్ పోటీలు, ప్రాజెక్ట్ ప్రదర్శనలు, పేపర్ ప్రెజెంటేషన్స్, సాంకేతిక క్విజ్‌లు, డిజైన్ ఛాలెంజ్‌లు నిర్వహించి విద్యార్థుల ప్రతిభను వెలికితీశారు.ప్రారంభంలో విద్యార్థి వ్యవహారాల మండలి అధ్యక్షురాలు ఇట్టా సారా మాట్లాడుతూ, ఈ ఉత్సవం విద్యార్థుల ఆవిష్కరణ, సృజనాత్మకతకు వేదికగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డా. కె.వి.ఎన్. సునీత విద్యార్థులను ఉత్సాహపరుస్తూ, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ముఖ్య అతిథి హిమ బిందు వెజెల్లా (లాయిడ్స్ టెక్నాలజీ సెంటర్ - క్లౌడ్ సర్వీసెస్ హెడ్) మాట్లాడుతూ, సాంకేతిక రంగంలో నిరంతర అభ్యాసం, ఆవిష్కరణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఆమె తన అనుభవాలను పంచుకుని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు.అనంతరం సాంస్కృతిక విభాగాధిపతి కె. వర్షా మూడు రోజుల కార్యక్రమాల వివరాలను తెలియజేశారు. సంగీతం, నృత్యం, నాటకాలు, ఫ్యాషన్ షోలు వంటి కార్యక్రమాలు విద్యార్థుల సృజనాత్మకతను ప్రతిబింబిస్తాయని తెలిపారు.చివరిగా ఎస్ఏసీ సమన్వయకర్త డా. వి. మాలతి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మంచినీరు రావడం లేదని జలమండలి కార్యాలయం ముట్టడి

**జూబ్లీహిల్స్, మార్చి 31, ప్రభాతవార్తః**



జలమండలి మేనేజర్‌కు సమస్యను వివరిస్తున్న మన్నె గోవర్ధన్‌రెడ్డి

జూబ్లీహిల్స్ డివిజన్ ఇందిరానగర్‌లో గత నాలుగు రోజులుగా మంచినీటి సరఫరా లేకపోవడంతో స్థానికులు జలమండలి కార్యాలయాన్ని ముట్టడించారు. బీఆర్ఎస్ ఖైరతాబాద్ నియోజకవర్గ ఇంఛార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డితో కలిసి వీరంతా జలమండలి కార్యాలయాన్ని ముట్టడించి మంచినీటి సరఫరాను పునరుద్దరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఎదుర్కొంటున్న సమస్యను తక్షణా జలమండలి మేనేజర్ అభిషేక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయనకు వినతిపత్రం అందించారు. సమస్యను గుర్తించి వెంటనే పరిష్కరిస్తామని జలమండలి మేనేజర్ బస్తీవాసులకు హామినిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నేతలు శంకర్, బాబు, కొండల్‌రావు, సింహం, శివ, దీప, బాలమణి పాల్గొన్నారు.

**సమస్యలపై శంకారావం**

ఖైరతాబాద్ నియోజకవర్గంలో సమస్యలపై శంకారావంలో భాగంగా మన్నె గోవర్ధన్‌రెడ్డి రాజ్‌నగర్ నాలాను పరిశీలించారు. నాలాలో వ్యర్థాలు పేరుకుపోయాయని, మురుగు వాసనతోపాటు దోమలు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ డివిజన్ అధ్యక్షుడు గజ్జల ఆనంద్, శ్రీనివాస్, శ్యామ్‌గౌడ్, అశోక్, బాలుయాదవ్, అబ్బాస్, రాజ్‌నగర్ అధ్యక్షుడు శ్రీనివాస్, వంశీ, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ప్రార్థనలు అయ్యే వరకు కట్టడాలు ఆపండి

**-నియోజకవర్గ బిఆర్ఎస్ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డి**

**అత్తాపూర్ మార్చి31,ప్రభాతవార్త :**

బుద్వేల్ గ్రామంలో క్రైస్తవ సోదరులు గత 60 సంవత్సరాలుగా ఈస్టర్ ప్రార్ధనలు జరుపుకుంటూ ఉన్న స్థలం రాజేంద్రనగర్ ప్రధాన దారిలో జిహెచ్ఎంసి జోనల్ ఆఫీస్ పక్కన ఉన్నది మంగళవారం ఆ యొక్క స్థలంలో ప్రార్ధనలు జరుపుకొనుటకు వీలుగా చదును చేస్తున్న సందర్భంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం అధికారులు వచ్చి అడ్డుకొని ప్రార్ధనలకు విగాతం కల్పించే విధంగా చుట్టూ ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారని పలువురు ఆరోపించా రు.ఈ విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన అట్టి స్థలాన్ని సందర్శించారు, అక్కడ ఉన్న అధికారులతో మాట్లాడారు,పోలీస్ వారితో మాట్లాడి ఇక్కడ ప్రార్ధనలు అయ్యే వరకు ఎలాంటి కట్టడాలు చేపట్టవద్దు అని ప్రజలతో చర్చించిచాకే అక్కడ ఎలాంటి పనులు అయిన చేయాలి అని కరాకండిగా చెప్పారు,బాధితక్రైస్తవ సోదరులతో మాట్లాడి మీ మనోభావా లతో ఆడుకుంటున్నా ఏ ఒక్క అధికారులను మా ప్రభుత్వం వచ్చాక వదలమని తీవ్ర కంఠముతో హెచ్చరించారు.అయితే అధికారులు మాత్రం యూనివర్సిటీకి సంబంధించిన భూమి కాబ్బటి ముందు జాగ్రత్తగా కబ్జా కాకుండా ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎవ్వరిని కూడా ఇబ్బందులకు గురి చేయడం లేదని పేర్కొన్నారు.

## ఉత్సవాల కమిటి రాష్ట్ర సభ్యులుగా సాయి కుమార్

**చార్మినార్,మార్చి 31 ప్రభాతవార్త :**

దొడ్డి కొమ్ముర‌య్య కురుమ జయంతి,వర్ధంతి ఉత్సవాల కమిటి రాష్ట్ర సభ్యులుగా హైదరాబాద్ పాతబస్తీ కిషన్‌బాగ్ ప్రాంతానికి చెందిన చిగుళ్ల సాయి కుమార్ కురుమ నియమితులయ్యారు.దొడ్డి కొమ్ముర‌య్య కురుమ జయంతి, వర్ధంతి ఉత్సవాల కమిటి రాష్ట్ర సభ్యులుగా నియమితులైన సాయి కుమార్ కురుమ బహదూర్‌పుర నియోజకవర్గం కురుమ సంఘం కార్యవర్గ సభ్యులుగా,రాష్ట్ర కురుమ సంఘం యూత్ కోఆర్డినేటర్‌గా కొనసాగుతున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వెనుక బడిన తరగతులసంక్షేమ శాఖ తనను దొడ్డి కొమ్ముర‌య్య కురుమ జయంతి,వర్ధంతి ఉత్సవాల కమిటి రాష్ట్ర సభ్యులుగా నియమించిందని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE II ADDL.JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT COURTS COMPLEX, AT : L.B. NAGAR
O.S. No. 162 of 2026

Between:
1. Sri. Jarugumalli Venkateswarlu, S/o Venkata Subbaiah, aged 61 years, Gender: Male, Occ: Mansion, Email: srinuvas0009@gmail.com, Mobile No. 9848668066.
2. Sri. Jarugumalli Vasu, S/o Venkateswarlu, aged 37 years, Gender: Male, Occ: Mansion, Email: srinuvasO009@gmail.com, Mobile No.9440594633.
3. Sri. Jarugumalli Venkata Shiva, S/o Venkateswarlu, aged 29 years, Gender: Male, Occ: Pvt. Employee, Email: venkatshiva003@gmail.com, Mobile No 9010223659.
All are R/o H.No.2-3-315, Plot No.3, Road No.4, Sainagar Colony, Nagole, Hyderabad-500 068. ...Plaintiffs
And
1. The Tahasildar, Balapur Mandal, Ranga Reddy District.
2. All Concerned. ...Defendants
All concerned (Defendant No.2)

SUMMONS
Whereas the above named Plaintiffs had filed the suit against the defendants for declaring them as legal heirs of Late J. Sheshamma with reference to property bearing 1) All that the Land bearing Plot No.26, in Sy No.94 Part, admeasuring 150 Sqg. Yards or 125.4 Sq Meters, situated at Gurramguda, H/o Nadergul village, Balapur Revenue Mandal, Ranga Reddy District, under Badangpet Municipal Corporation, now GHMC and bounded by: North: Plot No.25, South: Plot No.27, East: 30' wide Road, West: Plot No. 15 and (2) All that the Land bearing Plot No.27, in Sy No.94 Part, adnesauring 150 Sq. Yards or 125.4 Sq. Meters, situated at Gurramguda, H/o Nadergul village, Balapur Revenue Mandal, Ranga Reddy District, under Badangpet Municipal Corporation, now GHMC and bounded by: North: Plot No.26, South: Plot No.28, East: 30' wide Road, West: Plot No. 14. The said suit is posted to 17-04-2026 for appearance of any interested person in the subject matter of the suit. Therefore, all concerned are hereby notified to appear before the Hon'ble II ADDL JUNIOR CIVIL JUDGE, RANGA REDDY DISTRICT COURTS COMPLEX, AT L. B. NAGAR on 17-04-2026 at 10.30 AM in the forenoon in person or by a Pleader/advocate duly instructed as to why the relief prayed for should not be granted. TAKE notice that in case of default, the suit will be heard and determined in your absence as per law.
(BY ORDER OF THE HON'BLE COURT)
D. BRAHMA REDDY (ATS20250011179)
R. SUMITRA, Advocates
H.No. 1-1-11-164, Plot No. 113W/P, Road No.3, Telephone Colony, R.K. Puram, Hyderabad-500102. MOBILE NO. 8801166220
Email: dbradvocate@gmail.com
COUNSEL FOR PLAINTIFF'S

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD.
O.S. No. 113 OF 2026

Between:
Kondareddy Chandana Reddy, W/o. Kondareddy Dilipreddy, Aged 36 years, Occ: Housewife, R/o. 3-73, Chitkul, Medak, Telangana-502270. ...PLAINTIFF
AND
1. The Tahsildar, Khairatabad Mandal, Hyderabad District.
2. K.Vital Reddy, S/o K.Narayan Reddy Aged: 69 years, Occ: Business, R/o. 3-73, Chitkul, Medak, Telangana - 502270.
3. All Concerned ...DEFENDANTS
To,
Whom so ever it may all concerned
Please take notice that the above-named Plaintiff had filed a suit against the Defendants to declare the Plaintiff as the sole Class I legal heir of Late Master K. Nivin Reddy Who is expired on 26/04/2025 and consequently declare her as the absolute owner of the suit schedule property. The said suit is coming up on 17-04-2026 for your appearance. If any person(s) is/are having any claim, interest, right, title or objection/s, what so ever, in respect of said matter are hereby noticed to appear either in person or through an advocate with your defense at 10.30 a.m., before this Hon'ble court failing which the matter will be heard and determined ex-parte.

SCHEDULE OF PROPERTY
All that the House bearing Municipal No. 8-3-222/C/13/4 (old) 8-3-222/C/13/4/1 (A-54) (New) (PTIN No.1100817926) consisting Ground, First and second floor, admeasuring 310.00 Square Yards or 259.16 Square Meters, situated at Madhura Nagar, Yousufguda, Hyderabad, Telangna state, NORTH : 60.0 wide Road, SOUTH : House No.8-3-222/C/13/5, EAST : House No.8-3-222/C/13/7, WEST: 20.0 wide Road.
(By Order of the Hon'ble Court)
V. BASAVA RAJU
G. BHUVANESHWARI,
NIROSHA, Advocates
H.No. 6-R3-007, Plot No.1, Ground Floor, Maharaja Colony, Sikh Village, Secunderabad, Hyderabad – 500 003.
# 9989144441, # 6304859085
COUNSEL FOR PLAINTIFF

తెలంగాణ ప్రభుత్వం
సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ - గాజులరామారం సర్కిల్-57
నిట్ నం. & తేది: 04/DB/EE/గాజులరామారం సర్కిల్-57/CMC/2025-26, పని పేరు: నిర్వహణ పనులు (4 నం.లు) అంచనా మొత్తం లక్షలలో: 57.00 లక్షలు, ప్రారంభ తేదీ & సమయం: 31.03.2026 మ.3.00 గం. బిడ్ స్వీకరణలకు చివరి తేదీ & సమయం: 04.04.2026 మ.3.00 గం. వద్ద. బిండర్ అహ్వానించు అధికారి వివరాలు మొబైల్ నం.తో: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నం: 9701414306, హెడ్ డ్రాఫ్ట్స్‌మన్: సెల్ నం: 9063836115. తదుపరి వివరాలు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-57, CMC.
DIPR.No.17860-PP/CL/Advt/1/2025-26, తేది: 31.03.2026

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME
★ I, Meenakshi Rathi, W/o. Harsh Rathi, D/o. Dilip Kumar Kabra, R/o. H.No. 16-11-310/10/1/A/1, Saleem, Nagar Colony, Malakpet, Hyderabad-T.S.,-36 do hereby state that i have Changed my Name from Meenakshi Dilip Kumar Kabra (Before Marriage) to MEENAKSHI RATHI (after Marriage). This is for all record purpose. Vide affidavit dated 25th Mar 2026.
(Ro.No.313261)

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## బిసి జన జాగరణ జాతర పోస్టర్ ఆవిష్కరించిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ గవర్నర్ దత్తాత్రేయ, కటకం నర్సింగరావు

**ఎల్.బి.నగర్, మార్చి 31 ప్రభాతవార్త:**
నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరగబోయే బీసీ జన జాగరణ జాతర కార్యక్రమానికి హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయకు మాస్ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం నర్సింగ్ రావు విజ్ఞప్తి చేశారు. సభకు హాజరు కావాలని మంగళవారం ఆహ్వాన పత్రిక అందజేయడంతో పాటు దత్తాత్రేయ చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరింపజేశారు. ఏప్రిల్ 19వ తేదీన నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరిగే జన జాగరణ జాతర కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సహాయ సహకారాలు ఉండాలని ఈ సందర్భంగా కటకం నర్సింగ్ రావు విజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన దత్తాత్రేయ జన జాగరణ జాతర కార్యక్రమానికి తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాస్ ఉపాధ్యక్షులు దేవేందర్, మాస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి పెద్దవూర బ్రహ్మయ్య, ఎర్ర సత్యనారాయణ, బాలరాజు యాదవ్, నవీన్ గౌడ్ పాల్గొన్నారు.

## రిజర్వేషన్ విధానాన్ని ఎత్తివేయాలి : వక్కలంక

**ఎల్.బి.నగర్, మార్చి 31 ప్రభాతవార్త:**
రిజర్వేషన్ విధానాన్ని ఎత్తివేయాలని, ప్రతిభకు పట్టం కట్టాలని, కులం పేరుతో రిజర్వేషన్లు ఉండొద్దని బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య క్రమశిక్షణ కమిటీ చైర్మన్ వక్కలంక శ్రీనివాసరావు పేర్కొన్నారు. జాతి పేరుతో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్ లను ప్రభుత్వం తొలగించాలని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఎంఆర్పిఎస్ నాయకులు, మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ బ్రాహ్మణులు దేవాలయాల్లో పూజలు చేయవద్దని మాట్లాడడం బ్రాహ్మణులను కించపరచడమేనని, సమాజం నాగరికత నేర్చుకోక ముందు నుండే బ్రాహ్మణుడి మాటను సమాజం గౌరవించిందని అన్నారు. మంద కృష్ణ మాదిగ తన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, బ్రాహ్మణ సమాజానికి క్షమాపణ లేకపోతే తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. కులాలను అడ్డుపెట్టుకొని రిజర్వేషన్లు అనుభవిస్తూ సనాతన ధర్మాన్ని కాపాడుతున్న బ్రాహ్మణ కులాలను కించపరచినట్లు మాట్లాడడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హనుమాన్ జయంతికి హరీష్ రావుకు ఆహ్వానం



మాజీ మంత్రి హరీష్ రావుకుఆ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

**వనస్థలిపురం. మార్చి.31.ప్రభాతవార్త.**
ఏప్రిల్ 2న హనుమాన్ జయంతి సందర్భంగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ శోభాయాత్ర నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు చ్చేయనున్నారు కావున మంగళవారం హరీష్‌రావు పత్యేక ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ గురువారం సాయంత్రం 4:00 గంటలకు బి.ఎన్.రెడ్డి.నగర్ చౌరస్తా నుండి సాహెబ్ నగర్ శ్రీ త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తి, శక్తి, ఐక్యతకు ప్రతీకగా నిర్వహించే ఈ భవ్య హనుమాన్ శోభాయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో సీనియర్ భారస నాయకులు, మాజీ కార్పొరేటర్లు, పలు డివిజన్ల అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా సంరెడ్డి సురేందర్ రెడ్డి



సంరెడ్డి సురేందర్ రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న బిజెపి నాయకులు కొప్పుల దినేష్ ,చిత్రంలో రామ్ కోటేశ్వరరావు, బొక్క మధుసూదన్ రెడ్డి తదితరులు

**మలక్ పేట, మార్చి 31, ప్రభాతవార్త:**
మలక్ పేట్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు సంరెడ్డి సురేందర్ రెడ్డి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులయ్యారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన సంరెడ్డి సురేందర్ రెడ్డిని మాజీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, నాయకులు బొక్క మధుసుదన్ రెడ్డి, కొప్పుల దినేష్, వేమూరి రామ్ కోటేశ్వరరావు, తదితరులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి కామర్స్ గ్రాడ్యుయేట్ పట్టా పొంది మహవీర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్ సెక్రెటరీ, కరస్పాండెంట్ అయిన సంరెడ్డి సురేందర్ రెడ్డి 1977 నుంచి 2016 వరకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో ముఖ్య శిక్షక్, నగర వ్యవస్థ ప్రముఖ్, భాగ్ సంపర్క్ ప్రముఖ్ గా బాధ్యతలు నిర్వహించారు. 2016 నుంచి మలక్ పేట్ నియోజకవర్గంలో బిజెపి పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తూ పార్టీ బలోపేతానికి విశేషమైన కృషి చేశారు. అదేవిధంగా భాగ్యనగర్ జిల్లా బిజెపి అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా నియమితులైన సంరెడ్డి సురేందర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను సక్రమంగా నెరవేరుస్తానని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే బలాల

**మలక్ పేట, మార్చి 31, ప్రభాతవార్త:**



ఎస్ఐఆర్ గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బలాల చిత్రంలో అబ్రార్ తదితరులు

ఎస్ఐఆర్ సహాయ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మలక్ పేట నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం లోని పలు ప్రాంతాలలో నియోజకవర్గ ప్రజల సౌకర్యార్థం ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఎస్ఐఆర్ సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. మలక్ పేటలో ఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎస్ఐఆర్ సహాయక కేంద్రాలలో ఎస్ఐఆర్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అజంపుర డివిజన్ ఎంఐఎం నాయకులు అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

# దాతల సొమ్ము ధర్మకర్తల జేబుల్లోకి?

**-దేవుడి సొమ్ముకే ఎసరు పెడుతున్న కొందరు ధర్మకర్తలు**
**-ప్రభుత్వం విచారణ జరిపించాలని భక్తుల డిమాండ్**



కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయం

**సైదాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రముఖ పుణ్య క్షేత్రాల్లో ఒకటిగా ఉన్న కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయానికి దాతలు ఇచ్చే విరాళాలను కొందరు ధర్మకర్తలు తమ స్వంత అవసరాల కోసం వాడుకుంటున్నారని భక్తులు దేవాలయ కార్యనిర్వాహణాధికారికి ఫిర్యాదు చేయడం కలకలం సృష్టిస్తోంది. రంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక ఆదాయం కలిగి ఉన్న కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి దేవాలయంలో గత కొంత కాలంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు భక్తులను విస్మయానికి గురిచేస్తున్నాయి. దేవుడి సొమ్మును కూడా కాజేసే ధర్మకర్తలు ఉంటారా అని భక్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.

**వివరాల్లోకి వెళితే....**
తాను అనుకున్న పని కావడంతో దాదాపు నాలుగు నెలల క్రితం ఒక భక్తుడు దేవాలయానికి వచ్చి లక్ష రూపాయల విరాళాన్ని చెక్కుగా ఇచ్చాడు. అయితే ఆ సమయంలో ఈఓ గాని ఛైర్మన్ గాని లేకపోవడంతో ఛైర్మన్‌కు ఫోన్ చేయగా ఆయన చెప్పిన ఒక ధర్మకర్తకు చెక్కును ఇచ్చాడు. అయితే చెక్కుపై ఎవరి పేరు లేకపోవడంతో తనను ఎవరు అడుతారులే అని అనుకున్నాడో ఏమోగాని సదరు ధర్మకర్త ఆ డబ్బును తన స్వంత అవసరాలకు వాడుకున్నాడు. రెండు మూడు రోజుల క్రితం దేవాలయానికి వచ్చిన దాత లక్ష రూపాయలతో ఎలాంటి అభివృద్ధి పనిచేశారో చెప్పాలని సదరు ధర్మకర్తను నిలదీయడంతో బాగోతం బయటపడింది.

**అక్రమ వసూళ్లు..వేధింపులు....కాంట్రాక్టర్ల అవతారం....?**
ప్రస్తుత పాలక మండలిలోని కొందరు ధర్మకర్తలు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలక మండలి పేరుతో డైరీలు ముద్రిస్తామని చెప్పి ఒక అర్చకుడి నుండి రూ.40వేలు తీసుకుని ఆ సొమ్మును జేబులో వేసుకుని, మరో అర్చకుడితో కొన్ని డైరీలు తెప్పించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మీకు మేలు చేకూరుస్తామంటూ కొందరు అర్చకుల వద్ద కూడా వారు డబ్బును తీసుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దేవాలయ అభివృద్ధి కోసం పాటు పడాల్సిన ధర్మకర్తల్లో కొందరు ఏకంగా కాంట్రాక్టర్ల అవతారమెత్తి దాతలు ఇచ్చే సొమ్మును దేవాలయ అకౌంట్లో జమ చేయకుండా తమ వద్దే ఉంచుకుని పనులు చేపడుతున్నారని భక్తులు ఆరోపిస్తున్నారు. అంతేగాకుండా దేవాలయంలో టెండర్లు దక్కించుకుని వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని వేధింపులకు గురిచేస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**ఈఓ, చైర్మన్‌ల దృష్టికి రాలేదా..?**
దేవాలయంలో ఇటీవల చోటు చేసుకుంటున్న పరిణామాలు దేవాలయ కార్యనిర్వాహణాధికారి, పాలక మండలి చైర్మన్‌ల దృష్టికి రాలేదా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఛైర్మన్ చెప్పిన ధర్మకర్తకే దాత చెక్కును ఇస్తే, ఆ తర్వాత చెక్కు గురించి ఛైర్మన్ ఎందుకు అడగలేదనేది ఎవరికి అర్థంగాని ప్రశ్నగా ఉంది. గతంలో పనిచేసిన ఏ పాలకమండలిపై ఇంతటి తీవ్రమైన ఆరోపణలు రాలేదని భక్తులు పేర్కొంటున్నారు. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంలోని వ్యవహారాలపై వెంటనే దేవాదాయ శాఖ కమీషనర్ విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. కమీషనర్ విచారణ చేపడితే మరిన్ని అంశాలు బయటపడే అవకాశముందని భక్తులు పేర్కొంటున్నారు.

## బండారి రాజిరెడ్డి సేవలకు ప్రభుత్వం గుర్తింపు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఉప్పల్ చౌరస్తాలో స్వీట్లు పంచి సంబరాలు చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మార్చి 31 ప్రభాతవార్త :** ఉప్పల్ నుంచి నారపల్లి వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు బండారి రాజిరెడ్డి కారిడార్‌గా నామకరణం చేయడం హర్షనీయమని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. ఎం.ఎస్. నెం.104కు హర్షం వ్యక్తం చేస్తూ ఉప్పల్ చౌరస్తాలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పలువురు నేతలు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం ప్రజలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యంగా సంబంధిత అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిన ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి సేవలను స్మరించుకుంటూ ఈ నామకరణం చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన ముందడుగని, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రభుత్వం సహకారం అందించాలని ఆకాంక్షించారు. అదే విధంగా ప్రజల ఆశయాలను నెరవేర్చేందుకు తాను నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. కారిడార్‌కు బిజెపి నేతల అభ్యంతరంపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తీవ్రంగా ఖండించారు. గతంలో దబ్బులు వసూలు చేసి రాజకీయం చేశారని, తన సోదరుడిపై ఒక్క మచ్చ లేదన్నారు. ప్రజలకు సేవ చేసి గుర్తింపు పొందాలని బిజెపి నేతలకు హితవు పలికారు. డిల్లీకి వెళ్లి పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. రాజిరెడ్డి చేసిన సేవలకు తగు గుర్తింపు లభించిందన్నారు. తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, వేం నరేందర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు మాజీ కార్పొరేటర్లు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## కెఎల్ఆర్‌ను కలిసిన నాదర్‌గుల్ కాసువాగు భూముల రైతులు



కెఎల్ఆర్‌కు వినతి పత్రం ఇస్తున్న నాదర్‌గుల్ కాసువాగు భూముల మహిళా రైతులు

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్ గ్రామానికి చెందిన కాసువాగు భూముల రైతులు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డిని కలిసి తమకు న్యాయం జరిపించాలని కోరారు. మంగళవారం ఎస్సీ, బిసి వర్గాలకు చెందిన పలువురు రైతులు, మహిళా రైతులు తుక్కుగూడలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో కెఎల్ఆర్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. ఈ మేరకు ఆయనకు ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఇందిరమ్మ పాలనలో వ్యవసాయం చేసుకోవడానికి ఇచ్చిన భూములను బడా బాబులు ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని వారు వివరించారు. ఈ నేపథ్యంలో స్పందించిన కెఎల్ఆర్ ఫోన్‌లో సంబంధిత రెవెన్యూ, పోలీసు అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదే విధంగా భూములకు సంబంధించిన కోర్టు కేసులపై కూడా ఆయన ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ న్యాయం తప్పక జరిపిస్తానని కాసువాగు రైతులకు కెఎల్ఆర్ హామీనిచ్చారు. సమస్యలు దృష్టికి తెచ్చిన కాలనీవాసులు, కాంగ్రెస్ నేతలుఅదే విధంగా నాదర్‌గుల్ వివేకానందనగర్ కాలనీవాసులు స్థానిక కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో కెఎల్ఆర్‌ను కలిసి సమస్యలు వివరించారు. పార్టీ నాయకులు కూడా నాదర్‌గుల్-అంబేద్కర్ రోడ్డు అసంపూర్తి పనులను కెఎల్ఆర్ దృష్టికి తెచ్చారు. ఈ మేరకు సమస్యలపై కెఎల్ఆర్ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో నాదర్‌గుల్ కాంగ్రెస్ నాయకులు పెత్తుల్ల ఆనందర్‌రెడ్డి, వల్లపు సుభాన్ యాదవ్, అంకంగారి వెంకటేశ్ గౌడ్, బంగారి అశోక్, మహేందర్ యాదవ్, కుమార్ యాదవ్, బంగారి మణికంఠ, కాలనీవాసులతో పాటు గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఈద్ మిలాప్‌లు మతసామరస్యానికి ప్రతీక : మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్



మలక్ పేట ఆఫీసర్స్ మెస్ లో జరిగిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్, చిత్రంలో మలక్ పేట కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్, ఎంబిటీ అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ తదితరులు తదితరులు

**మలక్ పేట, మార్చ్ 31,ప్రభాతవార్త:**
ఈద్ మిలాప్ లు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని మలక్ పేట్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ పేర్కొన్నారు. మలక్ పేట ఆఫీసర్స్ మెస్ లో మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్ ఆధ్వర్యంలో ఈద్ మిలాప్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్, వైస్ చైర్మన్ ఫహీం కురేషి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబెద్దుల కొత్వాల్, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, ఎంబిటి అధికార ప్రతినిధి అంజదుల్లాఖాన్ తదితరులు విచ్చేసి మాట్లాడుతూ పండుగలు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతిరూపాలని వివరించారు. ఈద్ మిలాప్ కార్యక్రమాలు ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని పేర్కొన్నారు. ప్రజలందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని, ప్రజలందరూ ఐక్యతగా ఉండి అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. మలక్ పేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి షేక్ అక్బర్ మాట్లాడుతూ ఈద్ మిలాప్ విందులు ఐక్యత, అప్యాయత, ప్రేమాభిమానాలు పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఫెరోజ్ ఖాన్, బోయ నగేష్, రాజేష్ కుమార్, ఆమెర్ జావిద్, సద్దాం, ఉజ్మాషకీర్, బాలకృష్ణ యాదవ్, అశ్వక్ ఖాన్, గంట్ల కృష్ణ, జాఫర్ ,ధర్మేందర్, బొట్టు శ్రీనివాస్, శ్రీకాంత్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ భగాయత్‌లో ఖాళీ స్థలాల రక్షణకు చర్యలు : జెడ్‌సి



ఉప్పల్ భగాయత్‌లో ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా తదితరులు

**ఉప్పల్, మార్చి 31 ప్రభాతవార్త :** ఉప్పల్ భాగాయత్ పరిధిలోని ఖాళీ ప్రభుత్వ స్థలాల రక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ జోన్ ఎస్ఇ హరికిషోర్, జోనల్ సీపీ, ఏసీపీ టౌన్ ప్లానింగ్ నాగిరెడ్డి, డీఈఈ వెన్నెలగౌడ్, ఎఇ రాజ్‌కుమార్ తదితరులతో కలిసి పలు ప్రాంతాల్లో ఖాళీ ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఖాళీ ప్రభుత్వ స్థలాలకు పెన్సింగ్ వేయించాలని సూచించారు. ప్రభుత్వ స్థలాలలో ఆక్రమణలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మౌళిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అనంతరం భగాయత్‌లో ఒసి సర్టిపికేట్లు పరిశీలించారు. భవన నిర్మాణ అనుమతులను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## అడ్మిషన్ల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిబ్బంది ప్రచారం



**ఉప్పల్, మార్చి 31 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం సిబ్బంది మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. దోస్త్ ద్వారా ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్‌లు చేసుకోవాలని కోరుతూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. విజయ్ కుమార్ ఆధ్వర్యంలో కళాశాల సిబ్బంది ఇంటింటి ప్రచారం చేశారు. ఉప్పల్ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో బీ ఏ, బీకాం (కంప్యూటర్) ప్రథమ సంవత్సరం కోర్సులలో చేరాలని సిబ్బంది విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల ప్రత్యేకతలు వివరించారు. ఇంటర్మీడియెట్, వొకేషనల్ కోర్సులలో రెండో సంవత్సరం పరీక్షలు రాసిన విద్యార్థులు, ఇంటర్మీడియెట్ డ్రాప్ అవుట్స్ వంటి విద్యార్థులు గుర్తించి ప్రచారం చేశారు. ఈ కళాశాలలో చేరిన విద్యార్థులకు ఎలాంటి అదనపు ఫీజులు ఉండవని, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, క్రీడలు, ఉపకార వేతనాల మంజూరు, సాధారణ విజ్ఞాన పరీక్షల నిర్వహణ వంటి సౌకర్యాలతో పాటు అనుభవం మరియు నెట్, సెట్, స్లెట్, పిహెచ్‌డి వంటి అధిక విద్యార్హతలు గల బోధకులు ఉన్నారని ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దోస్త్ అడ్మిషన్ల సమన్వయకర్త జల్దా. విశ్వనాదజ్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.విజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మరియు ఐక్యూఏసి కోఆర్డినేటర్ సిహెచ్ సత్యనారాయణ, డా.ఎన్ రాజశ్రీ, డా.జి.తిరుపతయ్య, అకడమిక్ కో ఆర్డినేటర్ కె.గీత, డా.యమునారాణి, పి.విజయ్ కుమార్, డా.వి.శ్రీనివాసరావు, డా.ఆర్. చంద్రసాగర్, డా.పి.వెంకటేశ్వర్లు, స్రవంతి, అనూష తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వీరేందర్ బాబు

**సైదాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్.వీరేందర్ బాబు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భారతీయ జనతాపార్టీని మరింత బలోపేతం చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానని అన్నారు. బిజెపి అధిష్టానం చేపట్టే అన్ని కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి విజయవంతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు. సుస్థిరమైన పాలనను అందిస్తూ మచ్చలేని నాయకుడిగా మన దేశాన్ని నడిపిస్తున్న ప్రధాని నరేంద్రమోడితో ప్రతి ఒక్కరు కలిసి రావాలని వీరేందర్‌బాబు కోరారు. కాగా వీరేందర్‌బాబు ప్రస్తుతం భాగ్యనగర్ జిల్లా బిజెపి అధికార ప్రతినిధిగా ఉన్నారు. 2023 ఎన్నికల్లో యాకుత్‌పుర అసెంబ్లీ స్థానం నుండి ఆయన బిజెపి నుండి పోటీ చేశారు.

**వాంబే క్వార్టర్స్‌లోని సమస్యలు పరిష్కరించాలి : షేక్ మహమూద్**
**సైదాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** సింగరేణి కాలనీలోని వాంబే క్వార్టర్స్‌లోని సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతూ సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు షేక్ మహమూద్ మంగళవారం చార్మినార్ జోనల్ కమీషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. వాంబే క్వార్టర్స్‌లో త్రాగునీటి కొరత ఉందని, చెత్తాచెదారం పేరుకుపోయిందని, శిథిలావస్థకు చేరిన భవనాలకు వెంటనే మరమ్మత్తులు చేపట్టాలని జడ్‌సిని కోరారు. ఈ కార్యక్రమంలో శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

## వెంకట్‌రెడ్డినగర్ డివిజన్‌కు రూ.కోటి 29 లక్షల నిధులు : పరమేశ్వర్‌రెడ్డి



కాలనీ సంఘం నేతలకు నిధుల మంజూరు పత్రాలు అందజేస్తున్న పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**రామంతాపూర్, మార్చి 31 ప్రభాతవార్త :** రామంతాపూర్ వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌కు భారీగా నిధుల మంజూరు అయ్యాయని ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాలనీ సంఘం నేతలకు నిధుల మంజూరు పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకట్‌రెడ్డినగర్‌లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు రూ.కోటి 29 లక్షల నిధులు మంజూరు అయ్యాయని తెలిపారు. నిధుల మంజూరుకు కృషి చేసిన సిఎం రేవంత్‌రెడ్డికి, ఇంచార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డికి, ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్‌కు కాలనీ వాసులు అభినందనలు తెలిపారు. వెంకట్ రెడ్డి నగర్ డివిజన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టుగా తెలిపారు. రామంతాపూర్ బాగాయత్ వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ లోని సత్యానగర్ కాలనీలో రూ.24 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, లక్ష్మీ శ్రీకాంత్ నగర్ కాలనీ లో రూ.41 లక్షల తో అండర్ డ్రైనేజీ నిర్మాణం, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ శ్రీనగర్ కాలనీ రూ.16 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం పనులు, వెంకట్ రెడ్డి నగర్ డివిజన్ బాలకృష్ణ నగర్ లో రూ.48 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈకార్యక్రమం లో సత్యానగర్, బాలకృష్ణ నగర్, శ్రీనగర్ కాలనీ, లక్ష్మి శ్రీకాంత్ నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదం : ఎమ్మెల్యే



ఉప్పల్‌లో చలివేంద్రాన్ని ప్రారంబిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బన్నాల గీత దితరులు

**ఉప్పల్, మార్చి 31 ప్రభాతవార్త :** వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడుతాయని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ సర్వే వద్ద ఉప్పల్ ఆర్య సమాజ్, తపస్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి ప్రారంబించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చలివేంద్రాల ద్వారా ప్రజలకు ఎంతో మేలు ఉందని, స్వచ్ఛంద సంస్థలు ఇందుకు ముందుకు రావాలని కోరారు. ఆర్య సమాజ్ తపస్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య వేద సింధు ఆధ్వర్యంలో వేసవి కాలంలో ప్రజలకు దాహార్తిని తీర్చే ప్రయాసం చేయడం ప్రజలకు సేవ చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కోకొండ జగన్, ఎం.శ్రీనివాస్ యాదవ్, బాలకృష్ణ గౌడ్, ఉప్పల్ ఆర్య సమాజ్ తపస్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆచార్య వేద సింధు, కార్యదర్శి బొల్లం విజయ్ కుమార్, అధ్యక్షులు మహేందర్ జైస్వాల్, కార్యదర్శి పండిత్ విజయ్ కుమార్, పి లక్ష్మణ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికలలో బిజెపి జెండాను ఎగురవేయాలి

**న-బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**



బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావును సన్మానిస్తున్న మాజీ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి ౖ మధుసూదన్ రెడ్డి తదితరులు

**మలక్ పేట మార్చ్ 31, ప్రభాతవార్త:**
రానున్న మున్సిపల్ ఎన్నికలలో బిజెపి జెండాను ఎగురవేయాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పేర్కొన్నారు. సోమవారం రాత్రి కృష్ణ తులసి నగర్ కమ్యూనిటీ హాల్ లో జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్క మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భాగ్యనగర్ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బూత్ స్థాయి లో పార్టీని పటిష్టం చేయాలని, బీజేపీ రాష్ట్ర శాఖ నుంచి ఏ కార్యక్రమం వచ్చిన విజయవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు రానున్న మున్సిపల్ ఎన్నికలను దృష్టి లో ఉంచుకొని పని చేయాలని, వీలైనంతవరకు ఎక్కువ స్థానాలను భాగ్యనగర్ జిల్లా లో కైవసం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 100 రోజుల పాలనకు వ్యతిరేకంగా 100 రోజులు ప్రతి రోజు 6 గ్యారెంటీ ల పై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులుప్రకాష్ రెడ్డి,సంరెడ్డి సురేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లుకొత్త కాపు అరుణ రవీందర్ రెడ్డి,శ్వేత మధుకర్ రెడ్డి,జిల్లా నాయకులునిరంజన్ యాదవ్,సుభాష్ చందర్ జీ,జిల్లా ఇంచార్జి రంగా రెడ్డి,సహదేవ్ యాదవ్, సందడి సురేందర్ రెడ్డి, రామ్ కోటేశ్వర్ రావు,గౌర దేవేందర్, గజానంద్, కొప్పుల దినేష్, సురేందర్,తదితర జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో రికార్డు స్థాయిలో పన్నుల వసూలు : కమిషనర్ శైలజ

**ఉప్పల్, మార్చి 31 ప్రభాతవార్త :**



ఉప్పల్ సర్కిల్ కమిషనర్ ఎ.శైలజ

ఉప్పల్ సర్కిల్ పరిధిలో ఈ ఏడాది రికార్డు స్థాయిలో పన్నుల వసూలు చేసినట్లు డిప్యూటి కమిషనర్ ఎ.శైలజ తెలిపారు. మార్చి 31లో అపరాధ రుసుంపై వడ్డీ మాఫీ చేశారని, దీనిని ఎంతో మంది సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.37కోట్ల ఆస్తిపన్నులు వసూలు చేసినట్లు తెలిపారు. మెట్రో రైలు సంస్థ, కొన్ని ఇతర ప్రభుత్వ సంస్థల నుంచి ఇంకా పన్నులు రావాల్సి ఉందని ఆమె తెలిపారు. గత ఏడాది మార్చి వరకు 37.66 కోట్లు వసూలు చేశారని, ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.37 కోట్లు వసూలు అయ్యాయని తెలిపారు. వచ్చే నెల నుంచి ఎర్లీబర్డ్ పథకం ఉందని, ముందస్తుగా పన్నులు చెల్లించిన వారికి రాయితీ లభిస్తుందని ఆమె తెలిపారు. వచ్చే నెల నుంచి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపడుతామని ఆమె తెలిపారు. త్వరలోనే సిబ్బందిని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని, అన్ని విభాగలతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

## పండిత్ దీన్‌దయాళ్ ప్రశిక్షణ శిబిరానికి బిజెపి నేతలు



ప్రశిక్షణ శిబిర ప్రారంభోత్సవంలో పాల్గొన్న పసునూరి బిక్షపతిచారి తదితరులు

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** బొంగులూరు గేట్ వద్ద బిజెపి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా జరిగిన భారతీయ జనసంఘ్ ప్రధాన నేత పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ శిబిర ప్రారంభోత్సవానికి మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ కార్పొరేషన్‌కు చెందిన పలువురు బిజెపి నేతలు తరలివెళ్ళారు. తొలి రోజు ముఖ్య వక్తగా తెలంగాణ బిజెపి కో-ఆపరేటివ్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొలన్ శంకర్‌రెడ్డి విచ్చేసిన ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి రాష్ట్ర కిసాన్‌మోర్చా ప్రధాన కార్యదర్శి అంజయ్య యాదవ్ ప్రారంభించారు. అయితే ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బిజెపి తరపున క్లస్టర్-1 అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి, ప్రధాన కార్యదర్శులు ద్యాసాని తిరుపతిరెడ్డి, ఇంద్రావత్ రవినాయక్‌లతో పాటు రాత్లావత్ నీలా రవినాయక్, విజయలక్ష్మి రాజు ముదిరాజ్, చెవ్వ శ్రవణ్,ప్రభాకర్‌రెడ్డి పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ తగ్గించి ఇస్తున్నారు: సబితా ఇంద్రారెడ్డి



సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా సిఎం రిలీఫ్ ఫండ్ తీసుకుంటున్న మహిళ

**సరూర్‌నగర్, మార్చి 31 ప్రభాతవార్త:** ప్రస్తుత ప్రభుత్వ పాలనలో సిఎం రిలీఫ్ ఫండ్ మొత్తాలను భారీగా తగ్గించి ఇస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిల్లెలగూడకు చెందిన శారదకు మంజూరైన రూ.40 వేల సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అదే విధంగా బాలాపూర్ డివిజన్‌లోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బల్గూరి సురేష్‌కు మంజూరైన రూ.20 వేల చెక్కును మంగళవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనతో పోల్చితే ఈ ప్రభుత్వంలో లబ్ధిదారులకు తక్కువ మొత్తంలో సిఎం రిలీఫ్ ఫండ్ ఇస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ కార్పొరేషన్ బిఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు జమాల్‌పూర్ సునీత బాలరాజ్, మహేశ్వరం నియోజకవర్గ బిఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సిల్వేరి సాంబశివ తదితరులు పాల్గొన్నారు.



మీర్‌పేట్ పాత గ్రామంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే హనుమాన్ శోభాయాత్రకు హాజరుకావాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డిని ఆహ్వానిస్తున్న పల్లె అక్షయ్‌గౌడ్, యువకులు